# ఒక గమ్యం కోసం

గుమ్మం ముందు అడుగులచప్పుడయ్యే సరికి తలెత్తి చూసింది రాజులమ్మ, జడుస్తూనే. అడుగులచప్పుడన్నా, కాకుల అరుపులన్నా రాజులమ్మకి భయమే.

ఇంకెవరు?

మంగమ్మే చంటిపిల్ల నెత్తుకుని, సంచిచేత్తో పట్టుకుని లోపలికొచ్చింది. ఉదయం పదిగంటలవుతుంది. పటంలాగ ఎండ ఎత్తింది. ఏప్రిల్ నెల మొదటివారం ఎదురింటి గోడమీద కాకులరుస్తున్నాయి. ఎక్కడా ఆకు అల్లాడటం లేదు. వేపచెట్టమీద అక్కడా అక్కడా ఇంకా పూత వుంది. ఆకాశంలో ఒక్క మబ్బు కూడా లేదు. ఎర్రగా కాలినపెనంలాగ ఆవిర్లొస్తున్నది.

అమ్మమ్మా! అనుకుంటూ చంటిపిల్లడు తల్లిచంకదిగి రాజులమ్మ వొళ్ళోకొచ్చి వాలేడు. వాడికి రెండేళ్లు నిండి మూడు నడుస్తున్నాయి. ముక్కు చీమిడి తుడిచి, జుట్టు సవరించి వొళ్లో కూచోబెట్టుకుంది. తరుగుతున్న బీరకాయలు పక్కకి పెట్టి, కత్తిపీట గోడకి చేరేసింది.

"ఏట్రా నవీనూ, మళ్లీ ఎలిపోచ్చావా?" అని మనవణ్ణి ముద్దుచేసింది రాజులమ్మ. మంగమ్మ కాళ్లూ చేతులూ కడుక్కుని వచ్చి తల్లికెదురుగా పీటవాల్చుకుని కూచుంది. సంచిలోంచి మునక్కాయలకట్ట, కరివేపాకూ తీసి తల్ల దగ్గిరే పెట్టింది. దార్లో సంతదగ్గర బస్సాగితే, చవగ్గా బావున్నాయని. కొన్నాది. కరివేపాకు పెరట్లోదే.

"యేటమ్మా - అంతా కులాసాయేనా?" అన్నది రాజులమ్మ "అంతా కులాసాయే - ఆ దిక్కుమాలిన ఫాక్టరీ మళ్లీ మూతపడిపోయింది". అన్నది మంగ పమిట కొంగుతో ముఖానికి పట్టిన చెమట తుడుచుకుని ఈ నెలరోజులకే మనిషి చిక్కిపోయినట్టుంది. ముతక నేత చీరకట్టుకున్నది. మెళ్లో పసుపుతాడూ, నల్లపూసలూ తప్ప వొంటిమీద చిన్నమెత్తు బంగారం లేదు.

నెల్లిమర్ల జూటుమిల్లు మూడు మూడు రోజులకీ ఆగిపోవడమే. ఎప్పుడూ తగువులే. ఆగిపోయి - మళ్లీ ఒక నెలనడిచి - మళ్లీ నిన్న ఆగిపోయింది. మళ్లీ ఎప్పుడు తెరుస్తారో ఎవరికీ తెలియదు.

మంగమ్మ అసలు పేరు వెంకటపద్మావతి ఇంట్లో అంతా మంగా అనే అంటారు. బళ్లో చక్కగా పద్మా అనిపిలిచేవారు. ఏడవ తరగతి పాసయి మానేసింది. కాదు - మానిపించేశారు. పెద్దమనిషయినపిల్ల

- ఇక మరి చదివించి ఎందుకు అని మానిపించేశారు. కలిసొచ్చిన సంబంధం అని చెప్పి ముసిలోడు తెగ గొలికేసి గొలికేసి మరీ పెళ్లి చేయించాడు. ఇంత చిన్న వయసులో పెళ్లెందుకు ఆగమని బంధువుల్లో కొందరన్నారు. కాని - మనవరాలి పెళ్లి కళ్ల జూస్తానో లేదో, పదమూడేళ్లు చిన్న వయసుకాదు, ఈడేరిన పిల్ల కదా- అని చేయించిపించాడు. పెళ్లియ్యాక రెండేళ్లు బ్రతికాడు, ముసివాడు.

ముసిలోడంటే రామచంద్రరావు తాతయ్య. పూర్వకలపు మనిషి కులాభిమానం బంధుప్రీతి లావు. ఆరిపాక వాళ్ల సంబంధం, బాగాకలిసొచ్చిన సంబంధం అని పట్టుబట్టి మంగపెళ్లి చేయించాడు.

ఆరిపాక గోవిందరావు ఇంటర్ మీడియట్ సెకండియర్‌లో మేధమెటిక్స్‌లో తప్పాడు. విజయనగరం మహారాజా కాలేజీలో చదివాడు. ఇంటి దగ్గర చల్దణ్ణం తిని బాక్స్‌తో భోజనం పెట్టుకుని ఉదయాన్నె వెళ్లి సాయంత్రం వచ్చేవాడు. పోయిన సబ్జక్టు మరికట్టలేదు. ఇంటర్మీడియెట్ పూర్తి చెయ్యలేదు. ఐ.టి.ఐ. ఫిట్టరు ట్రయినింగు అయ్యాడు. పెద్ద చదువులు చదవడానికి తగ్గ తెలివీ లేదు, తడీ లేదు.

గోవిందరావు అన్న కృష్ణమూర్తి చిట్టివలస దగ్గిర ఒంటి తాడిలో టీచరుద్యోగం చేస్తున్నాడు.

గోవిందరావు తండ్రి రామలింగాచారీ, రామచంద్రరావూ చాలా మంచి స్నేహితులు. బంధుత్వం ఎటు తిరిగీ వున్నదే కాగా - రామలింగాచారి చాలా మంచివాడు. కష్టజీవి. నిజాయితీపరుడు. వడ్రంగం పనిచేస్తాడు. అన్నీ రైతువారీ పనులు నాగళ్లు చేస్తాడు. బండి చక్రాలు చేస్తాడు. బండికమ్ములు చేస్తాడు. రైతులు ధాన్యం కొలుస్తారు. ఇద్దరు కొడుకులూ, ఇద్దరు కూతుళ్లూను కూతుళ్లిద్దరికీ పెళ్లి చేసేశాడు. పెద్దవాడు కొడుకు కృష్ణమూర్తి బి.ఎ. బియిడి. చేసి టీచరుద్యోగం చేస్తున్నాడు. మధ్యన కూతుళ్లు కడసారం కొడుకు - గోవిందరావు.

గోవిందరావుకీ మంగనిచ్చారు. కట్నకానుకలు పెద్దగా లేవు. ఒక వాచీ ఒక ఉంగరం, కొత్త సైకిలు - రెండు జతల బట్టలు, పందిరి మంచం, ఆడపడుచులకు చెరొక నూటపదహార్లు కట్నం ఇచ్చారు. పెళ్లయి నేటికి పుష్కరం దాటుతుంది. మొదట్లో - ఎనిమిది వందలిచ్చేవారు. అది పెరిగి పెరిగి రెండు వేలయింది. ఒక ఏడాదినుంచీ రెండు వేలిస్తున్నారు. ఈ ఏడాదిలోనే ఇప్పటికి మూడుసార్లాగి పోయింది మిల్లు.

గొడవలు గొడవలు ఒకటే గొడవలు రెండేళ్లయింది సుమారు ఎప్పుడూ సమ్మె - ధర్నా - రైలెరోకో- లాఠీఛార్జీ - ఫైరింగు - అయిదుగురు కార్మికులు చచ్చిపోయేరు. పదిమందికి పైగా తీవ్రగాయాలయ్యాయి. గోవిందరావుకి యిలాంటివంటే ముందే భయం. దూరంగా వుంటాడు. ఆ తరవాత పరిస్థితులు కొంచెం కుదుటపడ్డాయి. కాని దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్న చందంగా వుంది.

మానాపురం శివకామరాజుగారికి మిల్లులో వాటావుంది పావలా వాటా ముప్పావలావాటా మార్వాడీలదే. వాళ్లు ఎప్పుడూ బొంబాయిలో వుంటారు. వాళ్ల మనిషొకడు ఇక్కడ మేనేజర్‌గా వున్నాడు. శివకామరాజు కొన్నాళ్లు ఎం.ఎల్.ఏ.గా పనిచేశాడు. మధ్యంతర ఎన్నికలొచ్చి అయిదేళ్లు నిండకుండానే

పదవి పోయింది. ఆ తరవాత మరి గెలవలేదు. నెల్లిపర్లలో కార్మికసంఘం వుంది. దానికి నాయకుడు వరప్రసాద్ అతనిది ఏలూరు. ట్రేడ్ యూనియన్ నాయకుడు. యాజమాన్యాన్ని నిలదియ్యగలడు. ప్రలోభాలకిలోబడడు. ఈ కార్మికసంఘం అతని నాయకత్వంలోనే పనిచేస్తున్నది. యాజమాన్యానికి ప్రసాదంటే అస్సలు పడదు.

గోవిందరావుకి కులవృత్తి బొత్తిగా రాదు. బాడితె ఎటునుంచి పట్టుకోవాలో తెలీదు. ఉలిముఖం ఎరగడు. రంపం ఎన్నడూ ముట్టినవాడు కాడు తండ్రి చచ్చిపోయాడు. చచ్చిపోయేసరికి పెద్దవయసూ కాదు. అరవై ఆయిదో, అరవై ఆరో వుంటాయి. ఏ జబ్బు లేదు. కొంచెం సుస్తీచేసి మూడోరోజున చచ్చిపోయాడు. పెంకుటిల్లుతప్ప మరేమీ ఆస్తిపాస్తులు లేవు. గోవిందరావే యింటిని పోషించాలి. గోవిందరావు తల్లి చాలా గొప్ప యిల్లాలు. గుట్టుగా కాపరం నడిపించుకొస్తుంది. రామలింగాచారి కొద్ది పాటి నగదు దాచాడు. దాంతో కొంతం కాలం కథ నడిచింది. ఇక యిప్పుడు గోవిందరావు సంపాదన మీదే బతకాలి. ఇంటి చుట్టూ ఆరు కొబ్బరిచెట్లున్నాయి. కొంత రాబడి రాకపోదు కాని చాలదు.

కాఫీ వెచ్చబెట్టి కూతురుకిచ్చింది రాజులమ్మ. రెండు జంతికలుంటే మనవడికిచ్చింది. వాడికదే పరమానందం అయిపోయింది. చేటంత మొహం చేస్తుకున్నాడు.

రాజులమ్మ ఆర్ అండ్ బీ ఆఫీసులో వాటర్ కేరియర్ ఉద్యోగం చేసి ఏడాదయి రిటరయిపోయింది. క్లాస్ ఫోర్ ఎంప్లాయీ. పెంకుటిల్లుంది. ఇద్దరు కొడుకులు. పెనిమిటికి స్థిరం లేదు. ఎటో తిరుగుతుంటాడు. కానీ సంపాదిస్తాడన్న మాట కల్ల. ఇద్దరు కొడుకులూ ఎవరి బ్రతుకులు వాళ్లు బ్రతుకుతున్నారు. తల్లికి రిటయిర్‌మెంట్ అనంతరం తన గ్రాట్యుటీ నలభయి వేలూ చెరిసగం రాసిచ్చీసింది కాదని కొడుకు లిద్దరికీ ఆమె మీద వల్లమాలిన కోపం. కొడుకుల కివ్వని మాట నిజమే. ఇచ్చేస్తే తనకి ఆధారం ఏదీ? పాతబడిన పెంకు తిరగేయించింది. వీధికుళాయికి వెళ్లి లేక ఇంట్లోనే కుళాయి పెట్టించింది. ఇంకా ఇంట్లో చిన్నా, చితకా రిపేర్లు చేయించింది. సుమారు ఇరవయివేల వరకూ ఖర్చయిపోయింది. మిగత సొమ్ముతన పేరనే బ్యాంకులో వేసుకుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్టుచేసింది. పెన్షను ఏడెనిమిదివందల వరకూ వస్తుంది. అక్కడికది అలా సరిపోతుంది. అప్పు లేదు, ఆస్తి లేదన్నట్టు కాలక్షేపం చేస్తున్నది. వచ్చినప్పుడల్లా కూతురుకి వందా యాభై యిస్తు వుంటుంది. సమ్మెలు - గొడవల్లో - జీతాలు లేక టక్ టకలాడిపోతుంటే ఆమె ఇచ్చిన డబ్బే. ఆధారం కూతురుకిస్తావుగాని మాకివ్వవు అంటారు కొడుకులు.

చిన్న కొడుకు మాకానివాడు. పెళ్లి చేసుకున్నాడు కాడు. తాగుడు - తిరుగుడు పేకాట వాడి బతుకు సరిలేదని అప్పుడప్పుడు లేదు లేదంటూనే - చూసీ చూడకా - వందా, యాభై యిస్తూ వుంటుంది. పనిచేస్తాడు. సంపాయిస్తుంటాడు. కానిస్థిరం తక్కువ పొగరెక్కువ తండ్రి సారం వచ్చింది వీడకని బాధపడుతుంటూంది రాజులమ్మ పెనిమిటికి మతిస్తిమితం తక్కువ. ఏడాదికీ ఆర్నెల్లకీ తలమాసి యిల్లుచేరతాడు. క్షవరం చేయాలి తలంటిపోసి బట్టలిస్తుంది. వారం పదిరోజులు వేళకింత తిండి తిని

ఇంటి పట్టూనుంటాడు. పదిపరకా పుచ్చుకుని మళ్లీ ఎటో వెళ్తాడు. ఎన్నిటికి సర్దుకు రాగలదు. ఆడమనిషి సంసారం ఎలా ఈదగలదు. రాజులమ్మ ఉద్యోగంచేసి, పెన్షన్ డబ్బులే లేకపోతే ఆకలికి మాడి చచ్చిపోయివుండును. రాజులమ్మ పెనిమిటికి మధ్య కొత్తగా దగ్గుపట్టుకుంది. ఇరవైనాలుగ్గంటలూ టీలూ, బీడీలు వుంటే చాలు. తిండి ధ్యాసతక్కువ మనిషి కంపలాగ ఎండిపోయాడు.

రాజులమ్మ కొడుకులకెవరికీ మంగమీద అప్పచెల్లెలన్న అభిమానంలేదు. పైగా కోపం కూడాను. తల్లి తమకు డబ్బులివ్వకుండా చెల్లెలికి అడపాదడపా సొమ్ములిస్తూ వుంటూందనీ, కొడుకులకంటె కూతురే ఎక్కువయిపోయిందనీ కోపం.

వెంకటపద్మావతి - మంగ - చాలా అందగత్తె బంగారు బరిణె. మహారాణీ కళ. తల్లికంటె పొడగరికూడాను. నొక్కుల జుత్తు చిన్న వయసులోనే పెళ్లయి ఇరవయ్యేళ్లు నిండకుండానే ఇద్దరు బిడ్డల తల్లి కాకపోయివుంటే - మనిషి మరింత అందంగా వుండేది. మంగమొగుడు గోవిందరావును చూసి - కాకి ముక్కుకు దొండపండని అంతా వేళాకోళం చేశారు. గోవిందరావు అందగాడేం కాదు. కొద్దిగా నలుపు మంగపక్క నిలబడితే చందమామపక్కనున్న మేఘంలా వుంటాడని బంధువులు పెళ్లిలోనే అన్నారు. పైగా కష్టపడిపనిచేసే రకం కూడాకాదు. పరమ బద్ధకిష్టు. తినడం ఊరిమీద తిరగడం. మనిషి బాగా పొడుగూ - పొడవుకు తగిన భారీ శరీరం మోటుగా వుంటాడు. ఇప్పుడు మిల్లు ఆగిపోయింది పెళ్లాం పిల్లల్ని ఎలా పోషించాలీ, ఏ పని చేసి నాలుగు డబ్బులు సంపాదించాలీ అన్న ఆలోచనలేదు. ఏమీ పట్టదు.

వరాలమ్మకి కోడలు మంగంటే వల్లమాలిన అభిమానం. మంగకూడా పనిమంతురాలు, పొందికయినది. ఏ పని చేసినా ఒబ్బిడిగా చేస్తుంది. మంగకూతురు శిరీష ఎలిమెంటరీ స్కూల్లో అయిదోతరగతి చదువుతుంది. తెలివైంది. తల్లిలాగ అందగత్తె కాకపోతే చిన్న మెల్లంటారంతాను.

గోవిందరావులో చాలా అవలక్షణాలున్నాయి. తినడానికి లోటు లేకపోయినా దర్జాకి లోటుండదు. వాచీ అమ్మేశాడు. సైకిలు కూడా అమ్మేశాడు. పెళ్లాం పిల్లలకి పైస ఇచ్చింది లేదు. పైగా పెళ్లాం మీద అనుమానం.

అతని జట్టుగాళ్లంతా విజయనగరం పోయి ఏదో ఒక పనీపాటా చూసుకుని నాలుగు డబ్బులు సంపాయించి పెళ్లాం పిల్లల్ని పోషించుకుంటున్నారు. ఈ మనిషికి ఆ ఆలోచనే లేదు. తినడం తిరగడం

పోనీ ఎవరింటికైనా వెళ్లి ఏపనోపాటో చేసుకుని బ్రతుకుదామంటే వెళ్లనివ్వడు. నామోషీ జరగనప్పుడు ఏం చేస్తాం? తను పోషించడు. నన్ను బయటికి వెళ్లి బ్రతకనివ్వడు. ఎన్నాళ్లిలా అర్ధాకలితో పడుంటాం" - అన్నాది మంగ.

"ఇక్కడ నాకాదుండిపోతానంటే చెప్పు, మా యాఫీసుకెళ్లి ఎవళికాళ్లో పట్టుకుని ఏదో నీకింతపనిప్పిస్తాను. అంతకీ కాదంటే - మిల్లు తిరిగినప్పుడు వెళిపోదూగాని" అన్నాది రాజులమ్మ.

"అలాగా వొప్పదమ్మా మనం ఇంకోరి కాళ్లకాడ బ్రతకాలా - పైగా ఆడదాయిని నువ్వు పనిచేసి సంపాయిస్తే - నీను తినాలా అంటాడు".

"మంచిదే ఆ పాటి పౌరుషం వుంటే మంచిదే"

వంటయింది. మనవడికి ఇంతచారన్నం తినిపించింది రాజులమ్మ. ఇంటి వెనక వేపచెట్టు మీద కాకులరుస్తున్నాయి. రెండు కాకులు గుమ్మందగ్గిరకొచ్చి కావుకావు మనడం ప్రారంభించాయి.

"దిక్కుమాలి కాకులు - మనింటికాడే అరుస్తాయి" అని విసుక్కుంది రాజులమ్మ కాకులరిస్తే రాజులమ్మకి చికాగ్గావుంటుంది. కాకులరిస్తే కష్టాలొస్తాయని రాజులమ్మకి భయం బెదురు. దానికి తగ్గట్టు మంగమ్మ వెళ్లిన నెల తిరక్కుండా ఇల్లు చేరింది.

వరాలమ్మ నోటి మంచితనం వల్ల రైతులు ధాన్యం యిచ్చినట్టూ, కూరలిచ్చినట్టూ ఆదుకుంటారు. నెల్లిమర్లవంటి పల్లెటూర్లో ఇంకా మట్టి పొయ్యిలున్నాయి. వరాలమ్మ మట్టి పొయ్యిలు వెయ్యడంలో పెట్టింది పేరు. చక్కగా యిటుకలు పేర్చి పొయ్యివేసి, మెత్తి, చిక్కగా పేడతో అలికి ముగ్గులు వేసి వస్తుంది. ఇన్ని బియ్యమో, పప్పులో ఇస్తారు. కొందరు జాకెట్టు గుడ్డ పెడతారు. రామలింగాచారి బ్రతికి వున్నప్పటినాటి పరపతినీ, మంచితనాన్ని అలా నిలబెట్టుకుంటూ వస్తున్నది. మనిషి క్షణం వూరికినే కూర్చోదు. ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే వుంటుంది. ఏనాడూ బద్ధకం ఎరగదు. బియ్యాలు చెరుగుతుంది. ఇళ్లూ వాకిళ్లూ కడుగుతుంది. పట్టుదులుపుతుంది. బట్టలుతుకుంది. నీళ్లు తోడుతుంది. పిల్లలకి స్నానాలు చేయించి, తలలుదువ్వుతుంది. నిద్ర పక్కమించి వేచింది మొదలు మళ్లీ ఏరాత్రికో మంచాన పడేదాకా, విసుపు లేకుండా పనిచేస్తూనే వుంది. ఇన్ని రకాలపనులు చేసి సరిపెట్టుకుంటూ వచ్చినా గడవడం కష్టంగానే వుంది. పిల్లలు ఆకలికి అల్లాడిపోయారు. ఫ్యాక్టరీ నడిచి నెలతిరిగేసరికి గోవిందరావు జీతం తెచ్చినప్పుడయితే ఎలాగో గడిచేది. ఇప్పుడు మరీ పూటబత్తెం, పుల్లవెలుగూ అన్నరీతిగా వుంది. ఇక లాభం లేదని చంటివాణ్ణి తీసుకుని మంగ పుట్టింటికి వచ్చింది.

వేప చెట్టుమీద కాకులరుస్తున్నాయి. మనవణ్ణి ఒళ్లో పెట్టుకుని అలా గుమ్మాలోనే చెంగు వేసుకుని వొరిగింది రాజులమ్మ, చిన్న కునుకు పుట్టింది.

మంగకి ఏమీ తోచక మేస్టారింటికి వెళ్లింది. ఆయన భార్య చాలా మంచిది. మంగ కష్టాలు తిని ఏదోటి సాయం చేస్తుంటుంది. గుమ్మంలోకి వచ్చిన మనిషి ఎన్నడూ వుత్తి చేతుల్తో పంపదు. ఒక పాత చీరా - గట్టిదే - ఒక పాతిక రూపాయలూ చేతిలో పెట్టింది. 'భోజనం చేశావా? లేకపోతే తిని వెళ్లు' అన్నది "లేదమ్మా అన్నం తినే వచ్చాను" అన్నది మంగ. ఇంతకారప్పూస పెట్టి - టీ చేసి ఇచ్చింది. టీ తాగేసి, కారప్పూస కొడుక్కోసం తెచ్చింది.

"ఎక్కడికి వెళ్లావు?" అన్నది రాజులమ్మ. చంటి పిల్లడు ఆడుకుంటున్నాడు. వాణ్ణి పిలిచి కారపూస చేతిలో పెట్టింది. వాడు సంతోషంతో మొహం ఇంత చేసుకున్నాడు.

"మేస్టారింటికెళ్లాను. ఆయమ్మగారిచ్చారు" అని చీర చూపించింది. కాస్త రంగు వెలిసిందనమాటే గాని గట్టి చీరే. చింత పిక్కరంగు. ఎంత లేదన్నా ఒక సంవత్సరం కట్టచ్చు. రాజులమ్మ సంతోషించింది.

అన్నలిద్దరూ ఊళ్లోనే వున్నారు. వెళ్దామా అని ఒక క్షణం ఆలోచించింది మంగ. కాని మళ్లీ ఏమనుకుందో వెళ్లలేదు. అన్నయ్య మంచివాడుకాదు కోపిష్టి. వదిన చాలా మంచిది. మంగంటే చాలా అపేక్ష. వెళ్లినప్పుడల్లా, మంగసంగతి తెలిసిన మనిషి కనక ఏదోటి ఇచ్చి పంపిస్తుంది.

రెండు రోజులు గడిచాయి.

సారిక - అన్నకూతురు - కనిపించింది. ఏడోతరగతి చదువుతున్నాది. బడి వెళ్తుంది గావును, బుజాన గాడిద బరువున్న సంచొకట్టుంది. 'అత్తా ఎప్పుడొచ్చేవు?' అని నవ్వుకుంటూ పలకరించింది.

"మూడ్రోజులయింది వచ్చి. బాగూన్నవా? మా అన్నయ్యున్నాడా ఇంటిదగ్గర?" "డాడీ లేరు. వైజాగ్ వెళ్లేరు. వస్తాను. బడికి టైమైపోయింది" అంటూ పరుగుపరుగున వెళిపోయిందాపిల్ల.

అవతలి సందు తిరిగేతే పెద్దన్నయ్య ఇల్లొస్తుంది. అన్యమనస్కంగా వెళ్లింది. వదినా? బాగున్నావా? అంటూ గుమ్మంలోంచే పలకరించింది.

"రా మంగా బాగున్నావా. ఎప్పుడొచ్చేవు? బాగా చిక్కిపోయేవు", అన్నది. వదిన సర్వమంగళ, లేచి నిలబడి మంగని లోపలికి తీసుకెళ్లింది.

మళ్లీ మిల్లు కట్టేశారనీ, ఇక చేసేది లేక తల్లిదగ్గిరచేరాననీ, వచ్చి మూడు రోజులయిందనీ, తన మొగుడి ఉద్యోగం తుమ్మితే ఊడిపోయే ముక్కులా తయారయిందనీ, తన బ్రతుకు దినదినగండంలా తయారయిందనీ చెప్పుకుంది. ఆ మాటలంటున్నందుకు చాలా చిన్నతనం అనిపించి తనమీదతనకే అసహ్యం వేసింది.

ఆ మాటా ఈ మాటా అయ్యాక "గతసారి నీకు చీరాజాకిట్టు ఇచ్చానని తెలిసి మీ అన్నయ్య నన్ను దెబ్బలాడారు. ఆయనకెందుకో అత్తగారన్నా నువ్వన్నా పడదు" అన్నది సర్వమంగళ.

"అమ్మ ఆస్తంతా నాకే ఇచ్చిసిందని మంట. ఏటుండిపోయింది ఆస్తి? ఆ పెన్షన్ డబ్బులొస్తన్నాయిగా బట్టి యింత బువ్వ తింటన్నాం" అన్నది. అని లేవబోయింది.

"ఉండు భోజనం చేసి వెళ్లు" అన్నది చెయ్యిపట్టుకుని.

"వద్దులే అన్నయ్యకి తెలిస్తే మళ్లీ కోప్పడతాడు"

'పోనీ వుండు' అని బొట్టుపెట్టి నాలుగుజామ పళ్లిచ్చింది. బాగా పెద్ద పళ్లు. ముగ్గిపోయి ఘుమఘుమలాడిపోతున్నాయి. చాలా తియ్యగా వుంటాయి. పెరట్లో చెట్టున పండినవి.

యింటికొచ్చేసరికి మంగ తండ్రివున్నాడు. తలాగడ్డం బాగా మాసిపోయాయి. బట్టలన్నీ చిరిగి మాసిపోయివున్నాయి. వెర్రి చూపులు చూస్తున్నాడు. చేతిగోళ్లూ కాలిగోళ్లూ అసహ్యంగా వున్నాయి. ఆ స్థితిలో తండ్రిని చూసిన మంగకి జాలివేసింది కోపమూ వచ్చింది, బాధా కలిగింది. ఐనా దగ్గిరికి వెళ్లింది.

"నాన్నా" - అన్నది మంగ. కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"అమ్మా - మంగ - బాగున్నావురా అమ్మా" అన్నాడు. గొంతు ఎక్కడో నుతిలోంచి వచ్చినట్టుంది. మనిషిలో పూర్వపు బిగువులేదు. వెర్రి నవ్వొకటి నవ్వాడు. మనవణ్ణి "దా నాన్నా -" అని దగ్గిరికి పిలిచాడు. వాడు దూరంగా నుంచుని బెదురుగా చూస్తున్నాడు. దగ్గిరికి వెళ్లలేదు. దగ్గుతెర ముంచుకొచ్చింది. ఎముకలన్నీ కూడదీసుకుని నీరసంగా చాలాసేపు దగ్గాడు. దగ్గుతెర తగ్గాక బీడీ ముట్టించాడు.

రాజులమ్మ డబ్బులిస్తే వెళ్లి క్షవరం చేసుకొని వచ్చాడు. వేన్నీళ్లతో స్నానం చేశాడు. ఉతికిన లుంగీపంచకట్టుకుని పడుకున్నాడు. ఇప్పుడుకాస్త పోలికవచ్చింది. దగ్గుతూనే వున్నాడు - ఒకటే దగ్గు -

"ఎన్నిటికని బాధ పడను తల్లీ" అని రాజులమ్మ కళ్లనీళ్లు తుడుచుకుంది.

"దగ్గొకటి పట్టుకుంది కొత్తగాను. గుండె ఎండిపోయింది. ఆ దిక్కుమాలి బీడీలు మానీమంటే మానకుంటున్నాడు. ఇంతకీ నా అదృష్టం ఎలాగుందో ఏటో".

శరభలింగాచారి వయసు సుమారు అరవై పైనే వుంటాయి. కొన్నాళ్లు ఫుడ్ కార్పొరేషన్ గోడౌన్లో - టెంపరరీగా - నైట్ వాచ్‌మన్‌గా పనిచేశాడు. పెర్మనెంట్ చేస్తారు. జీతం పెంచుతారన్నారు. ఇంతలో ఒకరాత్రి దొంగతనం జరిగి అయిదువందల పది బస్తాల మసూరీబియ్యం పోయాయి. ఆ గొడవలో ఉద్యోగం కాస్తా పోయింది. మూడొందలిచ్చేవారు. అంతే సరి. ఆ తరవాత ఇక ఏ పనీ లేదు మంగకంటె ముందు ఒక ఆడపిల్లపుట్టిపోయింది. ఆ సమయంలో రాజులమ్మ మా చెడ్డ జబ్బుచేసింది. బతకదిక చచ్చిపోతుందనుకున్నారు. ఆరునెలలు మంచాన పడ్డది. ఆ సమయంలో ఆచారి కిళ్లీకొట్టు కళావతిని మరిగేడు. రాజులమ్మకి జబ్బునయమై మళ్లీ తిరుగాడ్డం ప్రారంభించింది. కొంచెం నిమ్మళించాక ఉద్యోగానికి వెళ్లింది. ఆరునెలలు సెలవు పోయింది. కాని ఉద్యోగం పెర్మనెంటుది గనక కొంత సెలవు పోగా - కొంత జీతం వచ్చింది. బాగానే వుందనుకుంది. మంగ కడుపున పడింది. అదుగో అప్పుడు బయట పడింది. కళావతి రంకు వ్యవహారం. కళావతికి ఆచారిలో కొత్తసుఖం దొరికింది. ఒకంతట అతన్ని వదల్లేదు, పైగా ఎదురుమదుపు పెట్టేది. బట్టలు కుట్టించింది. ఖర్చుకి డబ్బులిచ్చేది. ఒక కిళ్లీకొట్టుమీద ఏది కావాలన్నా ఫ్రీ కూల్‌డ్రింకులు, కిళ్లీలు, సిగరెట్లు మాత్రం కాల్చేవాడుకాడు. మందూ ఏనాడూ కొట్టినట్టులేదు. మనిషి మంచి బింకంగా పొంకంగా వుండేవాడు. చాలా గొడవలయ్యాయి. చాలాకాలం ఈ వ్యవహారం తెగిందికాదు. రాజులమ్మ వీధెక్కి తిట్టింది. ఇంటదూరి ఏడ్చింది. నెత్తీనోరూ కొట్టుకున్నాది. ఆ తరవాత శరభలింగాచారికి మతిస్థిమితం తప్పింది. ఉండుండి వెర్రినవ్వునవ్వేవాడు. పిచ్చిచూపులు చూసేవాడు. ఆ కళావతి ముండే మందు పెట్టేసి వుంటుందని రాజులమ్మ నమ్మకం. మంగ పుట్టింది. ఆచారి యిల్లు విడిచి ఎటుపోయేడో పోయేడు. రాజులమ్మ పచ్చిబాలింతరాలు.

రాజారావని ఒక ఇంజనీరు - మహానుభావుడు ఆయన రిటయిరవబోతూ రాజులమ్మకి ఉద్యోగం వేయించాడు. రాజులమ్మ మంచితనం చూసే ఇచ్చారా ఉద్యోగం ఆయన. ఆ ఉద్యోగం యిప్పించి

పుణ్యం కట్టుకోకపోతే ఈ పాటి దారికూడా వుండకపోను. సంసారం యావత్తూ ఆకలికి మాడి చద్దురు.

అన్నీ కళ్లల్లో మెదిలేయి రాజులమ్మకి. దీపాలు పెట్టేరు.

గోవిందరావు వచ్చాడు. కొడుక్కి చాక్లెట్లిచ్చి ఎత్తుకున్నాడు. చాన్నాళ్ల తరవాత తండ్రి వచ్చినందుకు నవీన్ చాలా సంబరపడిపోయేడు. కరెంటు పోయింది.

గడ్డం మాసింది మనిషి కాస్త చిక్కాడు. అత్తగారిచ్చిన టీతాగి కొడుకుతో కులాసాగా ఊసులాడుతున్నాడు. గోవిందరావుకి రాత్రికి పెళ్లాం పక్కలోకి లేక పోతే తోచదు ఒక్క రోజు నాగా పెట్టినా ఒప్పుకునీ వాడుకాదు. అయితే ఈ మధ్య సంసారన లేక, భార్య సూటీపోటీ మాటలు పరలేకా ఏం చెయ్యలేక చెయ్యలేకపోతున్నాడు. ఒక పక్క తిండానికి తిండి లేక ఏడుస్తుంటే ఇదెక్కడి దిక్కుమాలిగోల తిన్నా తినకపోయినా నిత్యం పక్కలోకి రమ్మంటాడూ అని ఏడిచేది మంగ. పైగా మనిషికి వల్లమాలిన అనుమానం ఇక్కడెవడన్నా వున్నాడేటీ మిండడు. మాటి మాటికీ పుట్టింటికి పారొస్తావు అంటాడు. నువ్వు నన్ను సక్రమంగా పోషిస్తే నేనెందుకు పుట్టింటికెళ్తాను అంటుందిమంగ. పెళ్లాం అందంగా మెరిసిపోతుంటే చూసి సంతోషిస్తాడు. సంబరపడిపోతాడు. మళ్లీ అంతలోనే కుళ్లుకుంటాడు. మరీ అంత అందంగా లేకుండా, కొద్దిపాటి అందంగా వుంటే బాగుండుననుకుంటాడు. వరాలమ్మ దృష్టిలో మాత్రం కోడలు చాలా నిక్కచ్చయిన మనిషి. నిప్పు. ఆమె ఆదరణే లేకపోతే, మొగుడి దెప్పిపోటు మాటలకి సంసారం వదిలేసి ఏనాడో పుట్టిల్లు చేరివుండును మంగ.

ఇల్లు ఇరుకయిపోయింది అందరూ ఒకసారే వచ్చారు. చిన్న ఇల్లు. కూతుర్నీ అల్లుణ్ణీ కొట్టుగదిలో పడుకోబెట్టింది. గది చిన్నదే అయినా సౌకర్యంగా వుంటుంది. పెద్ద కిటికీ వుంది. అలమరా వుంది ట్యూబులైటుంది వాళ్లని అక్కడికి పంపి తానూ పెనిమిటీ మధ్యగదిలోనే పడుకున్నారు. మధ్యగదికాస్త పెద్దది. పక్క నున్న పెరట్లోకి గుమ్మంకూడా వుంది. ఫాను కూడా వుంది. పక్కింటికి వెళ్లి కొట్టుగదిలో అల్లుడికోసం టేబిలుఫాను తెచ్చింది.

ఆ రాత్రికి అల్లుడి మర్యాద కోసం కోడిగుడ్లు తెచ్చి కూరొండింది. శరభలింగాచారి మర్నాడు భోజనం చేశాక చెప్పా పెట్టకుండా ఎటుపోయాడో పోయాడు. రాత్రికి ఇల్లు చేరలేదు. బాధని గుండెల్లోనే అణుచుకుని కన్నీళ్లు తుడుచుకుంది రాజులమ్మ.

గోవిందరావు రెండు రోజులుండి వెళ్లిపోయాడు. సాధారణంగా అత్తవారింటి కొస్తే ఎక్కువ రోజులుండడు. శుక్రవారం మధ్యాన్నం వచ్చినవాడు, సోమవారం ఉదయం బయల్దేరాడు. విజయనగరానికీ నెల్లిమర్లకీ ఏ పాటిదూరం? రోజు వచ్చినా రావచ్చుకాని అత్తవారింటి దగ్గిరుండటం అంటే తగని మొగమాటం. వెళ్లేటప్పుడు తల్లియిచ్చిన వందరూపాయలూ మొగుడిచేతిలో పెట్టింది మంగ. రాజులమ్మ ఏదన్నా పనిచూసుకోమని చెప్పింది. తల ఎగరేశాడు.

"వేగం వచ్చీ-" అన్నాడు పెళ్లాంతో, లోపలి గుమ్మంలోనుంచుని

"ఏదన్నా చిన్న ఉద్యోగం చూసుకుని నాలుగు డబ్బులు సంపాయించి మార్గం చూస్తే తప్పకుండా వచ్చేస్తాను. కాపరం వదలుకోవడం ఎవరికిష్టం వుంటాది? నేను రాక ఎక్కడి కెళ్లగలను. సారికను బాగా చదువుకోమనండి. ఈ సారి వచ్చినపుడు తప్పక తీసుకురండి. అత్తగార్ని అడిగేనని చెప్పండి" అన్నది మంగ. సారికకు ఏడోక్లాసు పరీక్షలు దగ్గిరకొచ్చాయి. అందుకని రాలేదు.

మంగ వచ్చి నెలకావస్తున్నది. రోజులు బరువుగా గడుస్తున్నాయి. ఒక రోజు వాంతి చేసుకుంది. తల తిరుగుతున్నట్టుందని కళ్లు మూసుకుని పడుకుంది. ఆ రోజంతా ఏం బాగులేదు. రాత్రికి అన్నం ముందుకూచుంది గాని ఏం తినబుద్ధికాలేదని, నాలుగు మెతుకులు తిని లేచిపోయింది. కాస్త మజ్జిగన్నా తాగమంటే వద్దంది. మర్నాడు లేచి మామూలుగా ముఖం కడుక్కుని కాఫీతాగి వాంతి చేసుకుంది. మంగకి ఆలస్యంగా ఇదంతా అనుమానం వచ్చి గుండె గుభేలుమంది. తల్లితో చెప్పింది. కాస్సేపు గుంపుచింపులు పడ్డారు. లెక్కలు వేసుకుంది మంగ. చివరికి నెలతప్పిందని తేలింది.

"ఓలమ్మ కొంప మునిగిపోయిందే మా ఆయన ఏడాది క్రితమే ఆపరేషన్ చేయించుకున్నాడు. అదేం ఆపరేషన్ పల్లెటూరి డాక్టరు! లేకపోతే ఇప్పుడు నాకు నెలతప్పడం ఏంటి? ఈ సంగతి తెలిస్తే చంపేస్తాడు. మరి నన్ను బ్రతకనివ్వడు తల్లో - ఏం చేతునమ్మో" అని మంగ ఏడుపు ప్రారంభించింది. చంటిపిల్లడు, నవీన్, తల్లి ఏడవడం చూసి ఎందుకేడుస్తుందో బోధపడక, తనూ ఏడుపు లంకించుకున్నాడు.

"ఊరుకో - ఆపరేషన్ సమంగ చెయ్యకపోతే - ఫెయిలయిపోయి ఇలాగే జరుగుతాదట పద డాక్టుకాడికి ఎల్దాం" అన్నది రాజులమ్మ.

ఇద్దరూ రిక్షా కట్టించుకుని లేడీ డాక్టరు దగ్గరికి వెళ్లారు. మంగ నెలతప్పడం నిజమేనన్నది, తణిఖీ చేసిన డాక్టరమ్మ. మంగకి ఏడుపాగిందికాదు. ఒకోసారి ఫామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు ఫెయిలవుతుంటాయన్నది. మంగకి ఏ చెయ్యాలో పాలుపోలేదు. భయంతో వణికి పోయింది.

ఎలాగ తెలిసిపోయిందో అంతా మాయలాగయిపోయింది. గోవిందరావు దిగాడు. అంత ఎత్తున ఎగిరాడు. నానా మాటలూ అన్నాడు. ఒక మాటకాదు. గూబ పగలగొట్టాడు. నేనప్పుడే అనుకున్నానన్నాడు. ఇక నీకూ నాకూ సరన్నాడు. ఏడుపులూ పెడబొబ్బలూను. రాజులమ్మకి ఏం మాట్లాడ్డానికీ తోచలేదు. అన్నంకూడా తినకుండా వెళిపోయాడు.

ఆ రోజంతా తలలు పగలగొట్టుకున్నారు. పరిపరివిధాల ఆలోచనలు చేశారు. ఒంటితాడిలో ఉద్యోగం చేస్తున్న మంగబావగారు - కృష్ణమూర్తికి కబురు చేశారు. ఆయన వెంటనే రాలేదు. నిదానంగా ఆదివారం వచ్చాడు. అంతా విని ఫరవాలేదని ధైర్యం చెప్పాడు. గోవిందరావును గవర్నమెంటు డాక్టరు దగ్గరికి తీసుకెళ్లి పరీక్ష చేయద్దాం అన్నాడు. ఒకోసారి ఆపరేషన్లు ఫెయిలవుతుంటాయి. అంత మాత్రంచేత ఖంగారుపడిపోవద్దని చెప్పాడు. మళ్లీ ఆదివారం నాడు తీరికి చేసుకుని వస్తానని చెప్పివెళ్లాడు.

రోజులు గడుస్తున్న కొద్దీ మంగకి భయంగా వుంది. కడుపు వేపు చూసుకుంటుంటే చాలా

కంగారుగా వుంది. ఎబోర్షన్ చేయించుకుంటే ఆ అనుభవం లేదు మంగకు-! చాలా భయంగా వుంది. పోనీ కడుపు వుంచుకుని బిడ్డని కనాలంటే - అమ్మో - అది ఇంకా భయంగా వుంది. అన్న గారి మాట గోవిందరావు మొదట్లో వినలేదు. నేనెందుకు పరీక్షలు చేయించుకోవాలీ అన్నాడు. చివరికి చెప్పి చెప్పి ఆఖరికి గట్టిగా కేకలు వేసి దాదాపు బలవంతాన గవర్నమెంటు డాక్టరు దగ్గరికి తీసుకువెళ్లారు. ఆయన గోవిందరావుకి వీర్యపరీక్ష చేశాడు.

మర్నాడు మళ్లీ వెళ్లారు. మీకు ఫామిలీ ప్లానింగ్ చేసిన డాక్టరెవరని తిట్టిపోశాడు. కుటుంబ నియంత్రణ వారోత్సవాల్లో - నెల్లిమర్ల వచ్చిన డాక్టర్ల బృందం ఆపరేషన్ చేశారని చెప్పాడు గోవిందరావు. ఆ డాక్టరు ఎందువల్లనో కాస్త ఓపిగ్గా అన్ని సంగతులూ విడమర్చి చెప్పి - అనవసరంగా భార్యని అనుమానించడం తగదని చెప్పాడు. చివరికి గోవిందరావుకి వినక తప్పిందికాదు. అన్న కూడా చివాట్లు పెట్టాడు. తల్లి వరాలమ్మ కూడా కోడల్ని వెనకేసుకుని వచ్చింది.

"చూడు నాయనా - మంగ బంగారంరా. ఆడదాన్ని చెబుతున్నాను ఆలకించు. అది చాలామంచిది. అటువంటి ఇల్లాల్ని అనుమానించి నానా మాటలూ ఆడటం నీకు తగదు. కట్టుకున్నదాన్ని కంటినీరు పెట్టించడం తగదు నాయనా" అని చెప్పింది తల్లి. గోవిందరావుక్కూడా నిజమేననిపించింది. కాని ఆపరేషన్ ఫెయిలవడం అంటే అతనికి అర్థం కాలేదు.

చివరికి మంగ బావురుమని తల్లిని పట్టుకుని ఏడాచి "అమ్మాయ్య" అనుకుంది. గుండెలవించి పెద్ద బరువు దించినట్టుయింది. మనసు మబ్బులో విడిపోయిన ఆకాశంలా నిర్మలంగా వుంది. ఆడదాని బ్రతుకు అక్షరాలా అరిటాకు కంటె అల్పమయిందని స్పష్టంగా అనుభవపూర్వకంగా బోధపడింది.

ఒక వారం తరవాత, నలుగురూ చెప్పాక, గోవిందరావు గవర్నమెంటు డాక్టరు చేత కుటుంబనియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నాడు. వందరూపాయలిచ్చారు. మందులిచ్చారు. స్టీలుకంచం గ్లాసూ ఇచ్చారు. ఒక వారం తరవాత ఒక సారి వచ్చి వెళ్లమన్నారు. రాజులమ్మ ఈ గండం గడిచినందుకు వెయ్యి దేవుళ్లకు మొక్కుకుంది. అల్లుణ్ణి వారం రోజుల తనయింటి దగ్గిరే వుంచుకుని పోషించింది. ఒక రోజు గుడ్లు, ఒక రోజు చేపలు, ఒక రోజు కైమా - ఇలా మంచి తిండి పెట్టింది. ఆపరేషన్ జరిగిన వారం నాడు కార్జం కూర చేసింది. గోవిందరావు డాక్టర్ని కలిసివచ్చాడు. కుట్లు విప్పారు. ఇప్పుడు తేలిగ్గ వున్నాడు. ఆ సాయంత్రం గోవిందరావు ఏకళనున్నాడో పెళ్లాన్నీ కొడుకునీ తీసుకుని సినిమాకి వెళ్లాడు. న్యూపూర్ణాటాకీసులో కొత్తసినిమా. మంగ చాలా సంతోషించింది. చాలా ఆశ్చర్యపోయింది కూడాను. తనకు ఊహించనంత పెద్ద కష్టం రావడం అవి సులభంగా గడిచిపోయి అంతా సుఖాంతంకావడం ఆమెకి నమ్మ శక్యం కాలేదు.

పెరట్లో కొబ్బరి చెట్టు పైకి బీరపాదు పాకింది. ఆ పాదుకీమధ్య పురుగులు పట్టేశాయి. చీదరగా పెరడంతా పాకుతున్నాయి. ఇన్నాళ్లూ పాదు తియ్యబుద్ధికాక, పూతపట్టిన పాదు తీసెయ్యడమా అని రాజులమ్మ సంశయించింది. కాని ఇవ్వాళ తీసేసింది. మొదలంటా నరికేసింది. బీరపాదు. పెరడంతా బోసిగా కనపడింది.

వరాలమ్మ చూడ్డానికి వచ్చింది. సిటీబస్సెక్కి వచ్చింది. అరటిపళ్లూ, పువ్వులూ తెచ్చింది. మనవడికి కొబ్బరుండలు చేసి తెచ్చింది. ఈ మధ్య పెరట్లో వున్న ఆరుకొబ్బరి చెట్టుకీ కాయదింపించింది. అయిదు వందలొచ్చాయట. ఒక అరడజను ముదరకాయలు చూసి తెచ్చింది. ఒక నెలగ్రాసం. ఫరవాలేదు. అక్కడికదే శాన అన్నాది వరాలమ్మ.

కొబ్బరుండకొరుకుతూ నవీన్ ఆటలాడుతున్నాడు. వాడికిప్పుడు మూడేళ్లు. వాడిని పట్టుకోవడం కష్టంగా వుంది. వీధంతా పరుగులు తీస్తున్నాడు. వరాలమ్మ సాయంత్రం యింటికి వెళ్తూ, నవీన్ని కూడా తీసుకెళ్లింది. వియ్యపురాలికి జాకిట్టు గుడ్డ పెట్టింది, రాజులమ్మ. మంగకి మూడునెలలు నిండాయి.

***

మాకవరపు ఆదిమూర్తి బాగా ఉన్నవాడు. పూల్‌బాగ్ రోడ్డులో పెద్దమేడ, కొత్తపేటలో రెండువాటాల పెంకుటిళ్లూ ఉన్నాయి. అద్దెలొస్తాయి. చెక్కడపు పనిలో అందెవేసిన చెయ్యి, నలుగురు మనుషులు పనిచేస్తున్నారతని దగ్గిర పెద్ద కుటుంబం నలుగురుకొడుకులు, ముగ్గురు కూతుళ్లు. కులాభిమానం లావు. దేహి అని చెయ్యిచాపిన వాడికి లేదనకుండా తోచినకాడికి సహాయం చేస్తుంటాడు.

రాజులమ్మకి దూరపు బంధువు

విశ్వబ్రాహ్మణుల్లో చాలా వృత్తులవారున్నరు. స్వర్ణకారులు బంగారపు పనిచేస్తారు. మేం అందరికంటె ఎక్కువ అన్నభావంతో వుంటారు. కంచరం అంటే ఇత్తడి, కంచు, రాగి పాత్రలు చేసేవారున్నారు. వడ్రంగం పని, కమ్మరం పని చేసేవాళ్లున్నారు. అందరూ విశ్వబ్రాహ్మణులే. వాళ్లీనే షరాబులనీ, బ్రహ్మలనీ, కంసాలి వారనీ అంటారు. వీరిలో మళ్లీ లింగధారులనీ, తిరవణధారులనీ, దేశస్తులనీ శాఖలున్నాయి. కొందరు మత్స్య మాంసాలు ముట్టరు. స్వర్ణకారుల కుటుంబాల్లో బాగా చదువుకున్నవారూ, పండితులూ ఉన్నారు. కృష్ణదేవరాయల కాలం నాటి కందుకూరి రుద్రకవి విశ్వబ్రాహ్మణుడే. స్వర్ణకారులు మిగత వృత్తులవార్ని చిన్నచూపు చూస్తారు. వివాహం, భోజనం చెయ్యరు. అయితే ఇప్పుడిప్పుడు ఆ తేడాలు చాలా మంది పాటించడం లేదు. ఆదిమూర్తి బంధువుల్లో కొందరు కంచరం పనివాళ్లున్నారు. వాళ్లు ఎలమంచిలి, మాకవరపు పాలెం ప్రాంతాల్లో ఉన్నారు. ఇత్తడి బిందెలూ, ఇతర పాత్ర సామాగ్రి మంచినగిషీగా చేస్తారు. స్వర్ణకారుల కుటుంబాల్లో మంత్రతంత్రాలకు వేరే పురోహితులున్నారు. సిద్ధాంతులూ, ఆచార్లూ అంటారు. వివాహాది కార్యాలకు బ్రాహ్మణులను పిలవరు. కులస్తులతోనే శుభకార్యాలు చేయించుకుంటారు. రుంజులవారని కొందరు కేవలం విశ్వబ్రాహ్మంబల వద్దకు మాత్రమే యాచనకు వస్తారు. వారు అన్నీ తెలిసి స్వర్ణకారుల్ని కీర్తిస్తూ రుంజ వాయించి పనసలు చదువుతారు. ఆదిమూర్తికి రుంజల వారొస్తే మహాసంతోషం. వాళ్లచేత కరువుతీరా పాడిగించుకుని సుష్టుగా భోజనం అర్థనుటా పదహార్లిచ్చి పంపిస్తాడు. ఆదిమూర్తికి అరవై సంవత్సరాల పైనే. పచ్చ దబ్బపండుచాయ. ఇద్దరు కొడుకులు. ఉద్యోగం చేస్తుండగా మరొక ఇద్దరు దుకాణం మీదే వుంటారు. బంగారం పనిలో వాళ్లదీ పెద్దచెయ్యే.

ఒక రోజు రాజులమ్మ ఆదిమూర్తి గారింటికి వెళ్లింది. ఆదిమూర్తి భార్య శ్రీలక్ష్మమ్మకు చూపు సరిగ్గా ఆనదు. గొంతువిని రాజులమ్మని గుర్తుపట్టింది.

రాజులమ్మ మాటల సందర్భంలో జాగ్రత్తగా తనకష్టాలన్నీ చెప్పుకుంది. ఆదిమూర్తిని కూడా పలకరించి మా యల్లుడు గోవిందరావుకు ఏదన్నా కసింత దోవ చూపించమని అడిగింది.

సుంకరవీధిలో మెకానిక్ షెడ్ వుంది. అక్కడ కార్లూ, బస్సులూ, జీపులూ, లారీలూ రిపేరు చేస్తారు. బస్సులకి, లారీలకి బాడీలు తయారు చేస్తారు. పెయింటింగ్ చేస్తారు. ఆ మెకానిక్ షెడ్ యజమాని ఆదిమూర్తి తోడల్లుడికి స్వయానా అన్నగారు. వాళ్లు శివకోటివాళ్లు. వాళ్లూ బాగా ఉన్నవాళ్లే అతగానితో చెప్పి పనియిప్పిస్తాను. గోవిందరావు నొకసారి నా దగ్గిరికి పంపమన్నాడు.

మీ కడుపు చల్లగా రక్షించినారు బాబూ అని పదేపదే దణ్ణాలు పెట్టి కృతజ్ఞతలు చెప్పుకుని యింటికొచ్చింది రాజులమ్మ.

మంగమ్మ ఈ కబురువిని సంతోషించింది. కాని ఫెనిమిటి తిక్కమనిషి వెళ్తాడు వెళ్లడు అని కూడా అనుకుంది మనం మరొకరి కాళ్లకాడికి వెళ్లడం దేనికీ రేపోనేడో మిల్లు తెరుస్తారు. మనుద్యోగం మనకున్నాది గదా- అంటాడు. అలాగ అనవలసిన మనిషే గోవిందరావు.

మానాపురం శివకామరాజుగారికి రెండు బస్సులూ, ఒక లారీ ఉన్నాయి. అవి పేరుకి సిటీబస్సులేకాని ఒకటి రామతీర్థాలు లైనూ, మరొకటి కోరుకొండలైనూ తిరుగుతాయి. రెండు బస్సులూ సుంకరవీధిలోని శివకోటివారి షెడ్డుకి వచ్చాయి. రెండు బస్సులకీ బాడీలు కాస్త పెద్దవి చెయ్యాలి. చిన్న చిన్న రిపేర్లు చెయ్యాలి. పెయింటింగ్ చెయ్యాలి. పనంతా మూడు నాలుగు రోజుల్లో పూర్తయిపోవాలి. ఆ సమయంలో గోవిందరావుకి కబురొచ్చింది. వెళ్లాలా మానాలా అని "ఊగులాడేడు".

రాష్ట్రకార్మికమంత్రిగారి చొరవతో నెల్లిమర్ల జూట్ మిల్లుయాజమాన్యానికీ కార్మికసంఘాలకీ ఒప్పందం కుదిరింది. చివరికి రేపోనేడో మిల్లు తెరస్తారన్న మాట.

కార్మిక జనాల్లో సంతోషం కలిగించింది.

మంగమ్మ ఆడపిల్లని కన్నది.

మిల్లు తెరిచారు. గత ఆరేడు నెలలుగా మిల్లు తెరవనికారణం చేత కార్మికులకి - జీతాలయితే యివ్వలేదుగాని - నష్టపరిహారం కింద ఎంతోకొంత ఇస్తారని తెలిసింది. పోనదీ నయమే అసలు లేనిదానికంటే ఏం యిచ్చినా మహబాగే. ఒక వారం తరువాత గోవిందరావుకి రెండువేలు అందేయి. ఆడపిల్ల పుట్టిన వేళ విశేషం అన్నారు. ఇహను కష్టాలు గట్టెక్కుతాయి మంచిరోజులొస్తాయని సంబరపడ్డారు. ఆడపిల్ల ఇంట్లో కేరు కేరు మంటుంటే లక్ష్మీదేవి ఇంట్లో వెలిసినట్టే అనిపించింది రాజులమ్మకి. సంతోషంతో మంగకళ్లల్లో నీళ్లుతిరిగేయి. పిల్ల ఎర్రతెల్ల ఎర్రగా నిగనిగలాడుతూంది. కనుముక్కుతీరు అన్నీ గోవిందరావు పోలికలే.

మిల్లు తెరిచినందుకు కార్మికుల్లో ఎక్కడలేని సంతోషము వెల్లివిరిసింది. అందరి ముఖాల్లో

నవ్వులు చిందుతున్నాయి, వాతావరణం మళ్లీ కోలాహలంగా వుంది. అందరి బ్రతుకుల్లోనూ ఆనందం తొంగిచూసింది. కార్మిక సంఘం మొత్తానికి విజయం సాధించింది. ఇదంతా ఏలూరి ప్రసాద్ నాయకత్వంలోనే జరిగింది. ఇదంతా తన ప్రతాపమేనని మానాపురం శివకామరాజు గొప్పలు చెప్పుకున్నాడు ఐతే చర్చల్లో ఆయనకూడా కూర్చుని కార్మికులపక్షాన మాట్లాడినమాట నిజమే.

మంగమ్మ కూతురికి శ్రీలక్ష్మి అనిపేరు పెట్టారు. ఇన్నాళ్లకి తనజీవితం ఒకదారిలో పడినందుకు మంగ చాలా సంతోషించింది. గోవిందరావు రోజూ మిల్లుకి వెళ్లి వాస్తున్నాడు. నెల తిరిగేసరికి జీతం రెండు వేలు తెచ్చాడు.

జుట్ రేటు బాగా పడి పోయిందనీ నష్టాలొస్తున్నాయనీ - ఈ పరిస్థితిల్లో మిల్లునడపడం కష్టమనీ కొన్నాళ్లు మిల్లు మూసెయ్యాలనీ బొంబాయి యాజమాన్యం నుంచి కబురొచ్చింది.

రెండు నెలలు సుమారు నడిచినమిల్లు మళ్లీ మూతపడింది. పనివాళ్లు మళ్లీ మిల్లు తెరవాలనీ, మిల్లు మూసినకాలానికి జీతం యివ్వాలనీ విజయనగరం కలక్టరాఫీసు ముందు లేనిరాహారదీక్ష ప్రారంభించారు. వివిధ కార్మిక సంఘాలు - నెల్లిమర్ల కార్మికుల న్యాయసమ్మతమైన కోర్కెల్ని బలపరుస్తూ ఒకరోజు సమ్మె చేశారు.

★★★

గోవిందరావు శివకోటివారి మోటారు మెకానిక్ షెడ్‌లో పనికికుదిరాడు. ఉదయాన్నే లేచి వంటచేసి కేరియర్ సర్దియిస్తుంది. సీటిబస్సు మీద వెళ్లచ్చుకాని ఎంత లేదన్నా అదొక వందరూ పాయలు అదనపు ఖర్చు. నెల్లిమర్ల నుంచి విజయనగరం సైకిలు మీద వస్తున్నాడు. నెలకొక వెయ్యిరూపాయలు కిడుతున్నాయి. అదివారాలు పనిచేస్తే ఓవర్ టైములతో కలుపుకుని.

కూతురు సారిక ఇప్పుడు ఎనిమిదోతరగతి చదువుతుంది. తెలివైనది. సన్నగా రివటలా పొడువుగా పెరిగిపోతుంది. తండ్రి పోలికే. మనిషి చాలా పొడుగే ఇప్పుడు తల్లంత పొడవుంది. పన్నేండేళ్లు.

సామాన్యశాస్త్రంలో జీవిశాస్త్రభాగం చదువుతూ ఆలోచనల్లో పడింది సారిక. గొంగళి పురుగు సీతాకాక చిలుకలా రూపాంతరం చెందుతుందని వుంది.చాలా అసహ్యంగా వుండే గొంగళిపురుగు సీతాకోక చిలుకలా అందంగా రంగురంగుల్లో ఆకర్షిణీయంగా మారుతుందంటే నమ్మశక్యం కావడంలేదు. చదవడం వేరు నమ్మకం కుదరడం వేరు. టిచర్ చేత మళ్లీ చెప్పించుకోకుడదని ఎందుకనో నమ్మబుద్ధి కావడంలేదు. కాని - అన్నది అనివార్యం. వాస్తవం. నిజంట !

ఆరోజు ఆదివారం, మధ్యాహ్నం మూడుగంటలవుతుంది.

"అమ్మా అమ్మా" అని అరిచింది సారిక. ఆ పిలుపులోని కంగారు చూసి గబగబ పరుగెత్తుకొచ్చింది మంగ. లంగా నిండా రక్తం. సారిక పెద్ద మనిషియింది. సాయంత్రం గోవిందరావు వచ్చి కబురు చెప్పాడు. రాజులమ్మ చాలా సంతోషించింది. ఉన్నంతలోనే మనమరాలికి కొత్త బట్టలు కొన్నది.

రోజులు నింపాదిగా గడుస్తున్నాయి. ఉదయం పదీ - పదిన్నరవుతుంది. మంగ వంట గదిలోవుంది. వరాలమ్మ పెరట్లో బట్టలుతుకుతుంది. చంటి పిల్ల ఉయ్యాల్లో వుంది. రాజులమ్మ కంగారు కంగారుగా వచ్చింది, చమటలు కక్కుతుంది. మొహంనిండా ఆందోళన, భయం - శరభలింగాచారికి చాలా సీరియస్‌గా వుందట. ఆస్పత్రిలో వేశారు. ఇవాళ్లో రేపోనన్నట్టుంది పరిస్థితి. ఊపిరి తిత్తులు చెడిపోయాయని తణిఖీ చేసిన డాక్టరు చెప్పాడట. కళ్ల నీళ్లు పెట్టుకుని - చంటి పిల్లని చంకనేసుకుని తల్లి వెంట బయల్దేరింది మంగ. చంటిపిల్ల శ్రీ లక్ష్మికి పదినెలలు.

గవర్నమెంటాసుపత్రిలో తెలివిలేకుండా పడివున్నాడు శరభలింగాచారి. వంట్లో రక్తం లేదు. ఆస్మా అని తేల్చారు డాక్టర్లు. వళ్లంతా తెల్లగా పాలిపోయివుంది. మనిషి పల్చగా ఎండుచేపలా వున్నాడు. ఎముకలు కనిపిస్తున్నాయి. కళ్లు ఇంతలోతుకుపోయి మనిషి పోలిక పట్టలేకుండా తయరయ్యాడు. కొడుకు లిద్దరూ తండ్రి దగ్గరే వున్నారు. ఈ నాలుగురోజుల్లోనూ వెయ్యి రూపాయలవరకూ ఖర్చుయింది. గవర్నమెంటాసుపత్రి అని పేరేగాని - మందులు ఇంజక్షన్లూ బయటే కొని తెస్తున్నారు కొడుకులూ ఖర్చు చేస్తున్నారు. వెనకాడకుండా రాజులమ్మా ఖర్చు చేస్తున్నది, పెట్టపోషించకపోయినా పెనిమిటంటూ ఒకడు వుంటే అదొకదారి. పునిస్త్రీ అంటారు. ముత్తయిదువ అంటారు అదొక గౌరవం. రాజులమ్మకి చాలా భయంగా, బెంగగా ఆందోళనగా వుంది.

సుమారు ఒక పదిరోజులు కొట్టుకుని కొట్టుకుని జీవుడు లేచిపోయాడు. రాజులమ్మకి ఒక్కసారి లోకం యావత్తూ చీకటి కమ్మినట్టయిపోయింది. కూతురూ అల్లుడు, కొడుకులూ కోడళ్లూ మనవలూ అంతా చేరారు. ఎటుచూసినా ఏడుపులూ పెడబొబ్బలూను. దినవారాలు పూర్తయ్యేసరికి రాజులమ్మకి నీరసం పట్టుకుంది. ఇన్నాళ్లూ నిద్రాహారాలు లేవు రెప్ప పడితే వొట్టు పోడిగుడ్లు పడిపోయేయి. మనిషి కంపలా తయారయింది. ఇహను తనకూ చావు దగ్గర పడిపోయిందని అధైర్యం పట్టుకుంది, మొకాన పసుపూ కుంకం వుంటే వున్నగౌరవం లేనప్పుడు ఎక్కణ్ణించొస్తుంది. ధైర్యం దినవారాల ఖర్చులు కొడుకు లిద్దరూ పెట్టారు. ఎక్కడకి వాళ్లక్కడ వెళ్లారు. మంగని రెండు రోజులుండు వెళ్లుగానినే - అన్నది నువ్వే వచ్చీ - ఏం పాలుపోలేదు రాజులమ్మకి బ్రతుకు హఠాత్తుగా శున్యామయినట్టయిపోయింది.

★★★

ఆరోజు డిసెంబర్ 31, శుక్రవారం. షెడ్డులో ఉన్నవారందరూ హడావిడిగా ఉన్నారు. శివకామరాజుగారి బస్సులు రెండూ అలంకరించాలి. రంగు రంగులదీపాలు పెట్టాలి. మార్వాడీ కారొకటి వచ్చింది. దానికి పెయింటింగ్ చేసివ్వాలి. రేపు కొత్త సంవత్సరం జనవరి ఫస్టుకదా. అలాంటివే మరికొన్ని పనులున్నాయి.

షెడ్డునుకూడా అలంకరించాలి. రంగుకాయితాలూ. రంగు రంగుల బల్బులు పెడతారు కొబ్బరాకులూ అరటి గెలలూ కడతారు. వర్కర్లందరూ మజా చేసుకుంటారు. నైట్ షిఫ్టుకూడా పనిచేస్తున్నారు. రేపు పగలు బహుశా మరి పనిలోకి రారు.

గోవిందరావుకు మందుకొట్టడం అలవాటు లేదు గాని, ఎప్పుడైనా స్నేహితులు తగినవాళ్లు కలిస్తే వాళ్లతో కలుస్తుంటాడు, ఈ షెడ్డులో తాగనివాడు భాస్కర్రావొక్కడే.

భాస్కర్రావు వామపక్ష రాజకీయ పార్టీలో మెంబరు. కమ్యూనిజం సోషలిజం. మార్క్సిజం మొదలైన సంగతులు చెబుతుంటాడు. గోవిందరావుకి అతనితో పరిచయమైంది. భాస్కర్రావు కరపత్రాలు తెచ్చి ఇస్తుంటాడు. దేశవిదేశ రాజకీయాలగురించి, సమకాలిక సమస్యల గురించి ఎన్నెన్నో విషయాలు విడమర్చి మాట్టాడుతుంటాడు. భాస్కర్రావు ఈ రాత్రికి పనిలోకి రాడు. మామూలుగా రేపు పగలు వచ్చి డ్యూటి చేసుకుంటాడు.

రేపటి నుంచీ రెండువేల సంవత్సరం ప్రారంభం.

రాత్రి పన్నెండుగంటలకు పండుగ చేసుకున్నారు. గబగబపనులు పూర్తిచేస్తున్నారు. విజయనగరం లోనే కాదు - మొత్తం ప్రపంచం అంతటా కొన్నికోట్లు వ్యర్థమైపోతాయి. మందు పార్టీలు, కేకులు, కొవ్వొత్తులు, గ్రీటింగు కార్డులు, పూలగుత్తులు.. కేవలం ఒక్క విజయనగరంలోనే కొన్ని లక్షల బిజనెసుజరుగుతుందంటే ఆశ్చర్యంకాదు. ఈ మాటలన్నీ చెప్పినవాడు భాస్కర్రావు. కొందరు అతనిమాటలు విని ఏమిటలా మాట్లాడుతున్నాడని అదోకలా చూశారు.

జనవరి ఫస్టువెళ్లింది. కంటితో చూస్తుండగానే కాలం పరుగులు తీస్తున్నది. చలి ఎక్కువగా ఉన్నది, ఇళ్లముందు పండుగ ముగ్గులు నిండుగా అందాలు చిందిస్తున్నాయి. పండుగ దగ్గర కొచ్చింది. అన్ని ఇళ్లల్లో కోలాహలం వెల్లివిరిసింది, తెలుగు వాళ్లకు పెద్దపండుగ - భోగి మంటలు - సంక్రాంతి - వేడుకలు - అప్పుచేసయినా పిండివంటలు - పెద్దల పటాలు కిందికిదించి ఊరేగింపు - నైవేద్యాలు - కణపండుగ - పశువులకు అలంకారాలు - కొత్తబట్టలు- ఐతే ఈ వేడకలు క్రమగా తగ్గుతున్నాయి.

ఒక రోజు భాస్కర్రావు కరపత్రాలు పంచాడు. శృంగవరపుకోటలో లాకప్ డెత్ ! రేపుదయం కలక్టరాఫీసు దగ్గర ధర్నా - సాయంత్రం ప్రకాశం పార్కులో బహిరంగసభ తప్పకరావాలి సుమాఅని భాస్కర్రావు గోవిందరావుకు మరీ మరీ చెప్పాడు. సాధారణంగా అయితే గోవిందరావు ఇటువంటి మీటింగులజోలికి పోడు. తెలియదు - తెలుసుకోడు కూడా. ఈ సారి భాస్కర్రావు గోవిందరావును దగ్గరుండి లాక్కు పోయాడు - సాయంత్రం సభకి, పగలంతా పనిచేశాడు గనుక జీతంపోదు, భాస్కర్రావు ఈ రోజు పనిలోకి రాలేదు.జీతం కట్ !

సభకు ఎంతలేదన్నా నాలుగుయిదు వందల మంది హాజరయ్యారు. విప్లవ రచయితలు సంఘం, పౌరహక్కుల సంఘం, మరికొన్ని వామపక్ష ప్రజా సంఘలు కలిసి సభ నిర్వహించాయి. ముఖ్యబాధ్యత మాత్రం పౌరహక్కుల సంఘానిది. ఒక చిన్న దొంగతనం కేసుమీద ఒక టయిలరుని లాకప్‌లో వేసి దాదాపు ఇరవై రోజులు కొట్టారు. ఎముకలు విరిగిపోయాయి. ఒక రోజు తెల్లవారు జామున పూర్తిగా వెల్తురు రాక ముందు జీపుమీద తీసుకొచ్చి పోలీసులు ఇంటి గుమ్మం ముందు పడేసి పోయారు. తెల్లవారి లేచి వంటిమీద తెలివిలేని మనిషిని తీసుకుని ఆస్పత్రికి మోసుకెళ్లారు. ఆ సాయంత్రం ప్రాణం పోయింది.

చెయ్యనినేరం ఒప్పుకోమన్నారు. నాకు ఏపాపం పుణ్యం తెలియదని ఎంత మొత్తుకున్నా వినలేదు. ఆఖరికి - పది వేలిస్తే వదిలేస్తామని పోలీసులు బేరం పెట్టారు. మేం పేదవాళ్లం అంతయిచ్చుకోలేం. ఎలాగో తంటాలు పడి ఒక రెండు మూడు రూపాలిస్తాం అన్నారు భార్య పిల్లలు . ససేమిరా అన్నారు పోలీసులు, కర్కశంగా, క్రూరాతిక్రూరంగా అమానుషంగా ప్రవర్తించి నిండుప్రాణం తీశారు. ఒక నేరానికి సంబంధించి విచారించడానికి తీసుకొచ్చామనీ - వెంటనే ఇంటికి పంపించేశామనీ, తాను కడుపుకొప్పితో బాధ పడుతున్నానని చెప్పగా తమజీపుమిదనే ఇంటి దగ్గర వదిలి పెట్టామని పోలీసుల వాదన.

పోలీసులూ రూపంచేత మనుషులేగాని, వారు పాలకవర్గాల చేత పనిముట్లు. ప్రభుత్వానికీ ఉన్నతాధికారులకీ తొత్తులు. హృదయంలేని మరబొమ్మలు. కాకీదుస్తులు వేసుకున్న కిరాయి గూండాలు. వాళ్లకు జీత భత్యాలిస్తున్నది ప్రభుత్వాన్నీ, పాలకవర్గాల్నీ కాపాడటానికీ, ప్రజల్ని కొట్టడానికి, చంపడానికి, పోలీసుయూనిఫారాల్లో మనుషులుండరు. వాళ్లు మనిషి రూపంలో వున్న లారీలూ తుపాకీ తూటాలు. వాళ్లకు హృదయం జాతీ వుండవు. వాళ్లు చేసేదంతా "డ్యూటీ" కనుక మనం పోలీసుల వాళ్ళని సహృదయంతో ఆలోచించనవసరం లేదు. ఆ కాకీమూకల్ని నడిపించే పాలక వర్గాన్ని నిలదియ్యాలి. సాయుధపోరాటం చెయ్యాలి. ప్రభుత్వ అణచివేత చర్యల్నీ, దమన కాండనీ అరికట్టి ప్రజల్ని పోరాటం దిశగా సమాయత్తం చెయ్యాలి. ఇవీ వక్తల సారాంశం. టైయిలరు దుర్మరణానికి బాధ్యులైన వార్ని వెంటనే సస్పెండు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. దీన్ని చట్టవ్యతిరేక హత్యగా భావించి పోలీసులపై కేసు పెట్టాలి. మృతుని కుటుంబానికి వెంటనే లక్షరూపాయల ఎక్స్‌గ్రేషియా నగదు రూపంలో చెల్లించాలి. ఇవన్నీ డిమాండ్లు. సభకు అప్పన్నదొర అనే ఆయన అధ్యక్షత వహించాడు. ఆయన దాదాపు అరవై అయిదేళ్ల మనిషి ఉపన్యాసంలో నిప్పులు కురిపించాడు. ఖద్దరుచొక్కా, పైజమా తొడుక్కున్నాడు. ముఖం మీద కొద్దిగా స్ఫోటకం మచ్చలు. అయిదున్నర అడుగుల పల్చని మనిషి మిగత వక్తలు కూడా తమ ఉపన్యాసాల్లో పోలీసుల దుశ్చర్యల్ని ఖండించారు. ఉపన్యాసాలు చివరిదాకా వినేసరికి గోవిందరావుకు వొళ్లంతా వేడెక్కి పోయింది. తన చుట్టు ఇంత అన్యాయం, అక్రమం పేరుకుపోయివుంటే ఉన్నాళ్లూ తాను కళ్లుమూసుకున్నందుకు మొదటిసారిగా సిగ్గుపడ్డాడు. తన ముఖం తనకే ఇబ్బందికరంగా కనిపించింది. ఆలోచనల్లో పడ్డాడు. అధ్యక్షత వహించినా యనవి ఎక్కడో చూసినట్టపిపించింది. చప్పున గుర్తుకు రాలేదు. బాగా ఆలోచించాడు. భాస్కర్రావుతో కలిసి ఒక సారి సుంకరివీధి గౌడువీధి జంక్షన్ వాళ్లింటికి వెళ్లాడు. పుస్తకాల షాపు - ఎక్కడిక్కడి కమ్యూనిస్టు పత్రికలు, పుడక్తాలూ అమ్ముతుంటాడు. పౌరహక్కుల సంఘంలో చాలా కాలంగా పనిచేస్తున్నాడు. చిన్న వయసులో తెలంగాణా పోరాటంలోనూ, దాదాపు యాభై ఏళ్ల వయసులో శ్రీకాకుళ పోరాటంలోనూ పనిచేశాడు. ఎమ్జిరెన్సీలో దాదాపు రెండేళ్ల పాటు జైలులో గడిపాడు. ఏనాడు గవర్నమెంటుద్యోగం చెయ్యలేదు. ఊహ తెలిసినప్పణ్ణించీ ప్రజా ఉద్యమాల్లోనే గడిపాడు ఇప్పటికీ అలాగే పనిచేస్తున్నాడు.

సభకి పోలీసులు కూడా వచ్చారు. పోలీసుల్ని చూసి గోవిందరావుకి కొంచెం భయం వేసింది.

భాస్కర్రావు పోలీసుల్ని మఫ్టీలో వున్నా పోల్చేస్తాడు. వాళ్ల చూపులూ, తీరూ వేరు. ఇంటికి వస్తున్నప్పుడు 'స్వేచ్ఛ' పౌరహక్కుల పత్రిక ఇచ్చి చదవమన్నాడు. మామూలు పత్రికలే ఎన్నడూ చదివే అలవాటు లేదు. కాని ఈ సారి భాస్కర్రావు అంతగా చెప్పేడు కదా అని స్వేచ్ఛ పత్రిక చదివాడు. దేశంలో నిత్యం జరుగుతున్న అరాచకాల్నీ, ప్రభుత్వ దుర్నీతినీ సంఘటనల్తో, సహా వివరించిదా పత్రిక. చదువుతున్నంత సేపూ చలించిపోయాడు. లోగడ ఎన్నడూ పొందివుండని ఉద్రేకాన్నీ ఉద్వేగాన్నీ పొందాడు. రాజ్యహింస, కుటుంబ హింసలో ఎలా భాగమవుతున్నదో, పాలకవర్గ దుర్మార్గం వ్యక్తిగత జీవితాల్లో ఎటువంటి విషప్రభావం కలగజేస్తుందో బాగా అర్థమయింది.

సాయంత్రం సభలో విన్న విశేషాలూ, స్వేచ్ఛ పత్రికలో చదివిన సంగతులూ మంగతో చెప్పాడు. ఏం అర్థం కాకపోయినా విన్నది. పెనిమిటిలో గత కొన్నాళ్లుగా ముఖ్యంగా భాస్కర్రావుతో పరిచయమైనప్పటి నుంచీ వచ్చిన మార్పును గమనించి చాలా సంతోషించింది. క్రమంగా బీడీలు తగ్గించేశాడు. పూర్వం అప్పుడప్పుడు స్నేహితుల్తో కలిసి మందుకొడుతూ వుండేవాడు. ఇక ఎన్నడూ మందు ముట్టుకోకూడదని నిర్ణయించుకున్నాడు.

మంగ - మహిళ సంఘం సెక్రటరీ సహాయంతో - లోను పద్ధతి మీద కుట్టుమిషను కొన్నది. చుట్టుపక్కల వాళ్ల బట్టలు కుట్టడం ప్రారంభించింది. మొదట్లో పాడవుతాయేమోనని భయం వేసింది గాని మహిళా సంఘానికి వెళ్లి శ్రద్ధగా కుట్టడం నేర్చుకుంది. నాలుగు డబ్బులు చేతిలో ఆడుతున్నాయి. ఊరికే కూచుని గోళ్లు గిల్లుకోకపోతే ఇన్నాళ్లూ ఎందుకీ పని చేశాను కదా అనిపించింది. అయిందానికీ కానిదానికీ మొగుణ్ణి డబ్బులడక్కుండా చిన్న అవసరాలు తీరుతుండటం బాగానే వుంది.

నెల్లిమర్లనుంచి మకాం మార్చేశారు. మార్చిన తరవాతే కుట్టుమిషనూ పై సంపాదనా వచ్చాయి. కోట్ల మాదప్పవీధిలో ఒక పాతకాలపు పెంకుటింట్లో గదీవసారా తీసుకున్నాడు. అక్కడి కదే రెండు వందల యాభై. కుట్టుమిషను మీద ఆ పాటిసొమ్ము సంపాదిస్తున్నది మంగ. సారికను ఆ పక్కనేవున్న కస్బా మునిసిపల్ హైస్కూల్లో చేర్పించారు. ఆ అమ్మాయి ఏదో తరగతిలో కొచ్చింది, మొన్న జూన్‌లోనే, ఇంగ్లీషూ, లెక్కలూ ట్యూషన్ చదువుతుంది. నవీన్ కూడా బడికి వెళ్తున్నాడు. చిన్నమ్మాయి శ్రీ లక్ష్మికి రెండేళ్లు వెళ్లి మూడోఏడు వచ్చింది.

పరిస్థితుల్లో క్రమంగా మార్పులొచ్చాయి. ఇక ఇప్పుడు దేనికీ పెద్దగా తుడుముకోనవసరం వుండటం లేదు. మంగ మనసు నింపాదిగా వుంది. కూతురు సంసారంలో మంచి జరిగి కాస్త కుదుట పడినందుకు రాజులమ్మ కూడా సంతోషించింది.

మునిసిపల్ ఎలక్షన్లొచ్చాయి. ఎలక్షన్ల మాయ గురించీ పాకలవర్గ స్వభావం గురించీ భాస్కర్రావు చాలా సంగతులు చెప్పాడు. అక్కడికి అప్పన్నదొరగారి యిల్లు దగ్గరే. వెళ్లడం, ఏదో పుస్తకం తెచ్చుకుని చదివి తిరిగి ఇచ్చెయ్యడం, అప్పుడప్పుడూ దేశకాలమానపరిస్థితులమీద మాట్లాడటం అలవాటు చేసుకున్నాడు. జీవితంలో పాతికేళ్లకు పైగా కేవలం జులాయిగా తిని తిరిగినందుకు కొంత బాధ కలుగుతుంటుంది అప్పుడప్పుడు గోవిందరావుకి.

అన్న కృష్ణమూర్తి టీచర్స్ ఫెడరేషన్‌లో పనిచేస్తున్నాడు. ఆ ఫెడరేషన్‌లో చీలిక వచ్చి, ఒక భాగం డెమొక్రాటిక్ టీచర్స్ ఫెడరేషన్‌గా అవతరించింది. డీటీఎఫ్ మహాసభలు మొదటిసారిగా గుంటూరులో జరిగాయి. ఏప్రిల్ నెలలో ఎండలు మహాభయం గొలిపాయి. కృష్ణమూర్తి వెళ్లాడుగాని ఎండలకి జడిసి ఒక మూల కూచునేవాడు నీడ పట్టుచూసుకుని. విజయనగరంలో ఉత్తరాంధ్ర మహాసభలకి సన్నాహాలు చేస్తున్నారు. ఆ పని మీద తరచుగా కృష్ణమూర్తి విజయనగరం వస్తున్నాడు.

సమాజంలోని సమస్యలు పరిష్కారమైతేనే ఉపాధ్యాయుల సమస్యలైనా కార్మికుల సమస్యలైనా, విద్యార్థి యువజన సమస్యలైనా పరిష్కారమవుతాయని అన్న కృష్ణమూర్తి చెప్పిన మాటలు గోవిందరావుకి మనసులో నాటుకున్నాయి. క్రమక్రమంగా అవగాహన కావడం ప్రారంభమయ్యాయి. పోరాటంలో అనేక రకాలున్నాయి. స్థాయిలున్నాయి. సమ్మెలు, ధర్నాలు, రాస్తారోకోలు, బంద్‌లు, రిలేనిరాహారదీక్షలు, ఆ మరణ నిరాహారదీక్షలు, సాయుధ పోరాటాలు - ఏయే స్థాయిల్లో ఏయే పోరాటరూపాలుండేదీ వివరించాడు కృష్ణమూర్తి. అన్నిటికంటె ఉచ్చస్థాయి. పోరాటరూపం సాయుధపోరాటం, విప్లవం.

ఈ మధ్య గోవిందరావుకి చాలా మందితో పరిచయాలు ఏర్పడ్డాయి. చేతికి వచ్చిన ప్రతి కరపత్రమూ చదవడం, అవకాశం వున్న మేరకు మీటింగులకు హాజరుకావడం, పత్రికలూ పుస్తకాలూ చదవడం - ఈ పన్లు చేస్తున్నాడు. మనిషిలో పూర్వంలాగ వెకిలిమాటలు, తప్పుడు అవగాహనతో మాటలూ తగ్గిపోయాయి. గాంభీర్యం ఏర్పడింది. ముఖంలో, కళ్లలో ఆలోచనలు కనిపిస్తున్నాయి. భర్తలో ఈ మార్పుచూసి మంగ ఆశ్చర్యపడలేదు కాని కొద్దిపాటి ఆందోళనపడింది. మనిషి ఈ సారి ఎటుతిరుగుతాడో, గంభీరంగా మౌనంగా మితభాషిగా ఎందుకుంటున్నాడో బోధపడలేదు.

గోవిందరావు ఒక రోజు మంగను కూచోబెట్టి చాలా సంగతులు చెప్పాడు. ఆ మాటలు ఆలకిస్తుంటే పూర్వపు మనిషి కాదనిపించింది. డబ్బు పొదుపు చేసి ప్రతినెలా ఎంతోకొంత డబ్బు పోస్టాఫీసులో దాస్తున్నాడు. తన పాసుపుస్తకం చూపించాడు. అప్పుడూ అప్పుడూ కట్టిన డబ్బు ఆరొందల చిల్లర వరకూ వుంది. మంచిదే. ఎప్పుడైనా ఏ అవసరం వచ్చినా - ఎవరి దగ్గిరికి వెళ్లి చెయ్యిచాపనక్కర లేకుండా - తీసుకోవచ్చు. మంగ చాలా సంతోషించింది.

గోవిందరావుంటున్న యింటి పొరుగున ఒక నెల్లాళ్ల క్రితం బ్రాహ్మలు దిగారు. అతను తాలూకాఫీసులో రికార్డు అసిస్టెంటు. ముగ్గురు పిల్లలు. ఒక రోజు మంగ చేపలకూర వండింది. ఆ వాసనకి పొరుగావిడచాలా విసుక్కుంది. మంగావాళ్లు కంసాలి కులం అని తెలుసుకుని ఛీఛీ అని తిట్టిపోసింది. మంగ మనసు చివుక్కుమంది. కులం పేరు మీద కొందరు ఎంతెంత గర్వం ప్రదర్శిస్తారో కళ్లారా చూసి ఆశ్చర్యపోయింది. శాకాహారులు తాము గొప్పవాళ్లం అన్నట్లు పోజుపెట్టడం మాంసాహారం తినే వాళ్లని తక్కువగా చూడటం ఆమెకి బాధకలిగింది. రాత్రి ఇంటికి వచ్చాక గోవిందరావు ఈ సంగతి విని చాలా కోపం అయ్యాడు. కులం ప్రసక్తి తెస్తే ఊరుకునేది లేదని తగువుకు బయల్దేరబోయాడు. ఇంతాచేస్తే - ఆయన సాంఘిక స్థాయిగాని ఆర్థికస్థాయిగాని ఎక్కువేం కాదు. రికార్డు అసిస్టెంటు

అంటే బంట్రోతు కంటే కొంచెం ఎక్కువ. గుమాస్తా కంటే తక్కువ. ఆ మాత్రం దానికి ఎందుకంత నిక్కు? అని లేచాడు. కులం ఒక హోదా ఇవ్వడం, వృత్తిని బట్టి కులం యొక్క సాంఘిక స్థాయిని ఏర్పరచడం ఈ విషయం గురించి గోవిందరావు చాలా సంగతులు చెప్పాడు.

రాజులమ్మకి ఈ మధ్య వంట్లో బాగుండటం లేదు. గుండెల్లో ఒకటే ఆయాసం పేగుల్లో మంట. పులితేనుపులు. మందులు వాడుతుంది. కాని పచ్చం మాత్రం సరిగ్గా చెయ్యడం లేదు. ఉప్పు, కారం, పులుపూ తినకూడదు మసాలా కూరలు తినకూడదు. చప్పిడి పచ్చం చెయ్యాలి. చెయ్యదు. పులుసంటే చాలా యిష్టం. ఏ కూరయినా అయితే మసాలా వండటం, వేయించడం, లేదా పులుసు చెయ్యడం. వద్దని - మంగ దెబ్బలాడింది. దగ్గర్లోనే వున్నా కొడుకు లెవ్వరూ మంచీ చెడ్డా చూడరు.

చాన్నాళ్ల నుంచీ రావలసిన డబ్బు అయిదారువేల దాకా వచ్చింది. రాజులమ్మకి పించను పెరిగింది. వచ్చిన సొమ్ముకు మరికొంత అప్పు చేసి ఉన్న ఇంటిని చేర్చి పక్కనే ఒక చిన్న గదిలాంటిది వేయించింది. ఇప్పుడు చుట్టాలూ పక్కాలూ అదనంగా ఎవరొచ్చినా ఫరవాలేదు. ఇల్లు కొంచెం విశాలంగా వున్నది.

"ఒక్క ఊళ్లో ఉంటూ మీరు వేరేగా అద్దె కొంపలో దేనికీ ఇక్కడికెలిపోరండి అందరమూ ఒక్క దగ్గరే ఉండొచ్చు. మీరొస్తే కలిసి వుందామని గది వేశాను. నేనూ ఒక్క దాయినే కదా ఎవరున్నారు". అన్నాది రాజులమ్మ, చాలా నీరసంగా వుంది. మనిషి సాయం లేక విలవిలలాడుతున్నాది.

ఒప్పుకోలేదు గోవిందరావు, అక్కడికి మారితే తనషెడ్డుకి చాలా దూరం. సారిక చదువుకి - స్కూలుకీ దూరం పైగా మనం ఇంకొకరి మీద ఆధారపడినట్టుంటుంది. మన బ్రతుకు మనం బ్రతుకుదాం అన్నాడు. మంచిదే కాని మనం వుండేది పరాయి యింట్లో కాదుగా. మా అమ్మకు వయసు మళ్లింది. ఒంటరిది. ఈ వయసులో ఆమెకి తోడు కావాలి. మనిషి సాయంకావాలి. అందుకే రమ్మంది. తప్పేం లేదు వెళ్లడం మంచిదే. ఇది మంగ అభిప్రాయం మొత్తానికి ఆ పని అప్పటికి వాయిదాపడింది.

రాజులమ్మ వుంటున్న ఇల్లు పాతబస్టాండు దగ్గిర ఆశపు వీధిలో అక్కణ్ణించి సుంకరివీధిలో షెడ్డుకు పనికి వెళ్లాలంటే కష్టమే. కాగా సారికకు కూడా స్కూలు దూరం. అయితే మరి రోజూ నెల్లిమర్ల నుంచి కేరేజీ కట్టుకొని సైకిలు మీద వచ్చేవాడివి కదా, ఇదంత కంటె దూరం ఏమీ కాదు అన్నది మంగ. దాని ఊసు వదిలీ. అప్పుడు అలా కష్టపడ్డాం ఇప్పుడు కాస్త సుఖంగా వున్నాం ఇప్పటికిలా వుండనీ అన్నాడు గోవిందరావు. మళ్లీ మరోసారి ఆ ప్రయత్నం వాయిదాపడిపోయింది.

సరే కానీ ముందు ముందుకు చూద్దాం అని, ఆ గదీ, ఆ పక్కనున్న వసారా రెండువందల యాభైకి అద్దెకిచ్చేసింది. మొగుడూ పెళ్లాం ఇద్దరే. అతగాడు పుత్సలవాళ్ల బట్టల కొట్లో గుమాస్తా. పోన్లే, డబ్బుదేం వుంది, మనిషికి మనిషిసాయం అని సంతోషించింది రాజులమ్మ. వాళ్లకి పెళ్లయి పదేళ్లయినా పిల్లల్లేరట.

పక్కవీధిలో ఎవరో ఆడపిల్ల చచ్చిపోయిందంటే - ఎవరా అనుకున్నది రాజులమ్మ తెలిసిన పిల్లే లావణ్యాల గ్యాస్టవ్ పేలి, వంట గదంతా మంటలు లేచి, చీరకు ముట్టుకుని వళ్లు కాలిపోయి

చచ్చిపోయిందట. చాలా అందంగా వుంటుంది. పాతికేళ్లు కూడా వుండవు పైగా అని ఆదర్శ వివాహంట! గోవిందరావూ, భాస్కర్రావు, అప్పన్న దొర వాళ్లంటికి వెళ్లారు. మేనెల ఎండలు నిప్పులు చెరిగిపోస్తున్నాయి. పగలు రివ్వున వడగాల్పు - రోడ్లన్నీ గాడిపొయ్యిల్లా సెగలు కక్కుతున్నాయి.

లావణ్య భర్త ఆనందరావు జూనియర్ ఇంజనీరు. కట్నం లేని పెళ్లి. పైగా కులాంతర వివాహం కూడాను. కాని ఎంత కట్నం లేకపోతే మాత్రం కానుకలు రూపంలో సారె ఇవ్వరా అని అత్తగారు ఒకటే సాధింపట. ఆ కానుకల లిస్టు పెద్ద చేంతాడంత వుంది. కలర్ టీవీ, వీసిఆర్, ఫ్రిజ్జు, వాషింగ్ మెషిన్, టూ ఇన్ వన్, హీరో హోండా బండి, గాద్రెజ్ బీరువా, డ్రెస్సింగ్ టేబిలు, ఉంగరం, డబుల్ కాట్ మంచం... ఇంకా ఏవేవో కోరుతున్నారు. ఉంగరం పెళ్లిలోనే ఇచ్చారు. మంచం, బీరువా, టూ ఇన్‌వన్ ఇచ్చారు. మిగతవన్నీ ఎక్కణ్ణించి తేగలం? అంటారు లావణ్య అమ్మగారు. తండ్రి రిటయిర్డ్ టీచరు ఉన్న పెంకుటిల్లు తప్ప ఏ ఆస్తీ లేదు. లావణ్య తరవాత ఇంకో కూతురు పెళ్లి కెదిగివుంది. అదంతా మాకేం తెలీదు. మేం అడిగినవి మాక్కావాలంటారు అత్తగారు.

ఇది ఆదర్శవివాహం కాబట్టి సరిపోయింది. మా అబ్బాయి ఇంజనీరు చేస్తున్నాడు. ఏమీ ఎంత లేదన్నా మూడునాలుగు లక్షల కట్నం, లాంఛనాలు వచ్చేవే అన్నీ వదిలేశాం కాదూ. మా అబ్బాయి, మీ పిల్లని ఇష్టపడ్డాడు. ఆ అమ్మాయినే పెళ్లాడతానని పట్టుబట్టాడు. సరేనన్నాం - అందుకు మేం లోకువయిపోయామా. అని ఆ అత్తగారు ఒకటే సాధింపు పోరు పైకి కనపడకుండా చెరిగిపోసేస్తుందట. ఆనందరావు తల్లి దగ్గిర నోరు మెదపలేడు. లావణ్య మామగారు వుట్టి నోరులేని మనిషి పెళ్లాం చాటు మొగుడు ఉత్తి వాజమ్మ. ఆ పిల్ల చస్తే నిముషాల్లో లక్షల కట్నంతో లాంఛనాల్తో ఇంకో పిల్లని తీసుకొచ్చి కొడుక్కి పెళ్లిచెయ్యాలని అత్తగారి ఆలోచన.

లావణ్య తల్లిదండ్రులు చాలా మంచి వాళ్లు. సౌమ్యులు, శాంత స్వభావులు. వాళ్లకు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు, లావణ్య పెద్ద కూతురు. ఎక్కణ్ణించి తెచ్చి ఇవ్వగలరు. ఆదర్శ వివాహం, కులాంతర వివాహం అని చెప్పి మళ్లీ ఈ గొడవలన్నీ ఏమిటి అంటాడు లావణ్య తండ్రి . అక్కడికి ఏదో బాధపడి ఇవ్వగలిగినవి ఇచ్చారు. ఆఖరికి గాస్‌స్టౌ పేల్చిచంపేసి, ప్రమాదవశాత్తు జరిగిందంటున్నారు.

మహిళా సంఘం కార్యదర్శి పద్మజ, సభ్యులు విమల, సంధ్య, అరుణ, భాస్కర్రావు, పౌరుహక్కుల సంఘాలకి చెందిన జగన్నాథస్వామి అంత అప్పన్నదొర ఇంట్లో మీటింగు పెట్టుకున్నారు. గబగబ పని ముగించుకుని గోవిందరావు కూడా వచ్చాడు. లావణ్య అత్త మామలకీ, భర్తకీ శిక్షపడేదాకా ఉద్యమం విరమించేది లేదని అంతాకలిసి తీర్మానించుకున్నారు. మిగత ప్రజా సంఘాల్ని కూడా కలుపుకుని అవసరమైతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చెయ్యాలని నిర్ణయించుకున్నారు. అన్ని వివరాల్తో ఒక కరపత్రం రాసి, రెండు వేలు వేసి ఊరంతా పంచారు.

ఈ సంగతి మంగ కూడా తెలుసుకుని చాలా బాధ పడింది. నిండు యవ్వనంలో ఒక ఆడపిల్ల బ్రతుకు ఆఖరికి ఈ విధంగా ముగిసినందుకు కష్టం వేసింది. గోవిందరావు ఎప్పటికప్పుడు అన్ని సంగతులూ మంగకి చెబుతున్నాడు.

ప్రజల్లో గల వస్తు వ్యామోహం వల్ల మాలిన ధనదాహం మనుషుల్ని ఏ స్థితికి తెస్తాయో కళ్లారా చూశారు. పైగా వాళ్లు బాబాభక్తులు వాళ్ల భక్తి వాళ్లకి మానవత్వాన్నివ్వలేదు. వాళ్ల విశ్వాసం వాళ్లకి పాపచింత ఇవ్వలేదు. భక్తులకంటె కమ్యూనిస్టులు, నాస్తికులా, హేతువాదులు చాలా నయం అనిపించింది గోవిందరావుకి. భక్తులూ, భగవంతుడిపై విశ్వాసంగల వారూ చేసిన నేరాలు వాళ్లు చెయ్యారు. మానవత్వం భక్తిని మించిన గొప్ప విలువ.

"అలాంటి దుర్మార్గులకి ఎంత శిక్ష వేసినా మంచిదే" అన్నది మంగ, పూర్తిగా విని. సారిక తొమ్మిదో తరగతిలోకొచ్చింది. నవీన్ మూడోక్లాసులో కొచ్చాడు. శ్రీలక్ష్మికి మూడేళ్లు నిండాయి.

గోవిందరావు రోజా పేపరు చూడడు. ముఖ్యమైన విశేషాలు భాస్కర్రావే చెబుతుంటాడు. కొయ్యూరు ఎన్‌కౌంటర్ గురించి చెప్పాడు ఒకరోజు. డిసెంబర్ నెల మొదటివారం, చలి జాస్తిగా వుంది. వింటుంటే గోవిందరావు నరాల్లో ఉద్రేకం పొంగింది బొత్తిగా ఇంత ఘోరంగా రెండు మూడు రోజులు వరసగా పేపరు చదువుతున్నడు శ్రద్ధగా ఎక్కడో బెంగుళూరులో ముగ్గుర్ని అరెస్టు చేసి హెలికాప్టర్‌లో తీసుకొచ్చి కరీంనగర్ జిల్లా మంథని డివిజన్ కొయ్యూరు దగ్గర అడవుల్లో కాల్చి చంపేశారు. శ్యాం, మురళి, మహేష్ - ముగ్గురూ విప్లవపార్టీ అగ్రనాయకులు. వారితోపాటు నిష్కారణంగా ఒక పశువుల కాసుకునే యువకుల్ని అమాయకుల్ని చంపేశారు. అతని పేరు లక్ష్మిరాజం. కాని అతనికి పోలీసులు అరుణ్ అనిపేరు పెట్టి నక్సలైట్ ముద్రవేశారు. రాష్ట్ర రాజధాని పెద్ద ఎత్తున అల్లరై చెలరేగింది. పోలీసుల అక్రమాలు బయటపెడుతూ, కరపత్రాలూ పోల్ పోస్టర్లూ వేశారు. ఈ హత్యపై న్యాయ విచారణ జరిపించాలని హైకోర్టులో పౌర హక్కుల సంఘం రిట్ వేసింది. అమరవీరుల అంతిమ యాత్ర చాలా పెద్ద ఎత్తున వేలాది మందితో జరిగింది. గద్దర్ గజ్జకట్టి పాటలు పాడాడు. టీవీలో ఈ వార్తలన్నీ ప్రజానీకం చూస్తున్నారు. నాలుగోరోజు కరపత్రాలూ పోస్టర్లూ వచ్చాయి. కొయ్యూరు ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ విజయనగరంలో వాల్ పోస్టర్లు వెలిశాయి. కొయ్యూరు సంఘటనపై విరసం ప్రచురించిన పుస్తకం చదివేసరికి, గోవిందరావుకి వెంటనే విప్లవంలోకి దూకాలనీ, సాయుధ పోరాటదళాల్లో చేరిపోవాలనీ ఆవేశం కలిగింది. ఆ ఊపులో పౌరహక్కుల సంఘంలో సభ్యత్వం తీసుకున్నాడు. స్వేచ్ఛ పత్రికకు చందా కట్టాడు. అయితే అరుణతార పత్రికకు కూడా చందా కట్టెయ్యమని అప్పన్న దొర ప్రోత్సహించాడు. వెంటనే దానికీ చందాకట్టేశాడు.

బాబా మెట్టదగ్గర పేదలకు ఇళ్ల స్థలాలిస్తున్నారని తెలిసి, అప్పన్న దొర సహాయంతో కాయితం పెట్టాడు గోవిందరావు. దానికో వంద రూపాయలు ఖర్చయ్యాయి. దాదాపు పాతిక ముప్పయి మంది వరకూ పెట్టి - సంబంధిత గుమాస్తా చేతా, రెవిన్యూ ఇనస్పెక్టరు చేతా సంతకాలు చేయించి - ఆ దరఖాస్తులు స్పెషల్ డిప్యూటీ తాసిల్దారు చేతికి ఇచ్చారు. ఆయన కాయితాలు, కొంచెం సమయం పడుతుంది తప్పక సహకరిస్తాం అని చెప్పాడు. ఇస్తే ఒక్కొక్కరికీ మూడున్నర సెంట్ల స్థలం ఇస్తారట.

ఈ మధ్య రాజులమ్మకి అస్సలు బావుండటం లేదు. గాస్టిక్ అల్సర్‌కి తోడు - బీపీ కూడా వచ్చింది. మనిషి బాగా నీరసంగా తయారయింది. తల ఉన్నట్టుండి ముగ్గుబుట్టలా పండిపోయింది.

వయసుకు మించిన ముసలితనం కనిపిస్తుంది ముఖంలో. పచ్చం సరిగ్గా చెయ్యదు. ఏది పడితే అది తినేస్తుంది. ఆ తినేతిండయినా ఒక వేళా పాళా ఉండదు.

ఉన్నట్టుండి ఒక రోజు గాభరా చేసేసింది. పెద్ద పెద్ద వాంతులయాయి. ఒకటే పేగుల్లో నొప్పి - ఆ నొప్పి ఎక్కువయి వెన్నులోకి పాకి మనిషి బాధతో గిలగిలలాడిపోయింది. పక్కింటివాళ్లు - మంగకి కబురు చెప్పారు. రిక్షా చేసుకుని పరుగు పరుగన వచ్చింది మంగ. నీరసంగా మంచం మీద పడుకుని వుంది. కళ్లూ, కడుపు, ఇంతలోతుకుపోయాయి. ఏది తిన్నా ఇమడటం లేదట. గబగబా కటకం డాక్టరు దగ్గరికి తీసుకువెళ్లింది తల్లిని మంగ. తణిఖీ చేసి మందులు రానిచ్చాడు డాక్టరు. ఇంజక్షను కూడా ఇచ్చాడు. జెల్యూసిల్ ఎమ్‌పీయస్ క్రమంతప్పకుండా రెండుపూటలా వాడమన్నాడు. నొప్పి వస్తే వాడమని బరల్గన్ మాత్రలు రాశాడు. బలానికి హెప్టాగ్లోబిన్ టానిక్ వాడమన్నాడు. వేపుళ్లూ, పులుసులూ, మసాలాలూ, కోడిమాంసం సముద్రం చేపా తగ్గించాలి. తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం వేళమించకుండా తీసుకోవాలి. ఇలా తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ చెప్పాడు. ఇంటికొచ్చాక మంగ తల్లిని కూచోబెట్టి అపచ్చం చేస్తున్నందుకు దెబ్బలాడింది. వంటచేసి మజ్జిగ అన్నం పెట్టింది. బత్తాయి పళ్లు తెచ్చి రసం తీసి ఇచ్చింది. మందువేసుకొని పడుకొంది రాజులమ్మ. ఈరోజు ఖర్చంతా మంగే పెట్టింది, డాక్టరు ఫీజూ మందులూ బత్తాయి పళ్లూ. . .

సాయింత్రం నాలుగయ్యాక టీ చేసి, ఇచ్చి, ఒక సంచిలో మూడు నాలుగు చీరలూ జాకెట్లూ ఇంకా ఏవేవో బట్టలూ సర్ది - రిక్షా ఎక్కించి - తిన్నగా ఇంటికి తీసుకొచ్చేసింది మంగ.

"అమ్మమ్మొచ్చింది - అమ్మమ్మొచ్చింది" అని చప్పట్లు కొడుతూ పిల్లలు చుట్టూ చేరారు. అందరూ అప్పుడే స్కూలు నుంచొచ్చారు.

"ఊరుకోండ్రా. మీద పడకండి. అమ్మమ్మకసలే వొంట్లో బాగులేదు - వెళ్లి ఆడుకోండి-" అన్నది మంగ

కాని పిల్లల్ని దగ్గరికి తీసుకుని వొళ్లో కూచోబెట్టుకుంది. నవీన్ వీపు మీద ఎక్కాడు. నవీన్ వొళ్లో చేరాడు. సారిక -" అలా అయిపోయే వెంటమ్మమ్మా" అన్నది. "ముసలిదాన్నయిపోయాను కదా- మరందుకే అలా అయిపోయేను" రాజులమ్మ

నాలుగు రోజులదాకా వేళకి ఇంత తినడం పడుకోవడం తప్ప - మంచం దిగలేదు. గడపదాటలేదు. కొడుకులిద్దరికీ కబురుకూడా తెలీదు. ఇక చూడ్డానికి ఎవరొస్తారు? ఎవరు కబురు చెప్పి తీసుకొస్తారు?

నెల్లిమర్ల కబురు తెలిసింది. వియ్యపురాలికి వొంట్లో సుస్తీగా వుందని తెలిసి వరాలమ్మ చూడ్డానికొచ్చింది. పెరట్లో పండిన అరటిపళ్లూ, సపోటా పళ్లూ తెచ్చింది. ఒక అరడజను కొబ్బరి కాయలు తెచ్చింది. బజార్లో కొని నాలుగు బత్తాయిపళ్లు తెచ్చింది. రాజులమ్మ దగ్గరకూచుని చాలా అభిమానంగా ఆత్మీయంగా మాట్లాడింది.

"ఎందుకు వదినగారూ మీరొక్కరే అక్కడ మీ యింట్లోనూ - వీళ్లిక్కడ ఈ అద్దె ఇంట్లోనూ ఉండటం. అందరూ కలిసి ఒక దగ్గిరే వుంటే మంచిది కాదూ. ఈ వయసులో మీకు మనిషి సాయం అవసరం. రేపు ఏ కష్టమో, రోగమో రొష్టో వచ్చినా చూసేవారెవరూ ? "అన్నది వరాలమ్మ, రాజులమ్మతో.

మంగ అక్కడే వున్నది. ఆ మాట మీద చర్చలు జరిగాయి.

"నేనూ అదే చెప్పాను. ఎటొచ్చీ మీ అబ్బాయే ఏ సంగతీ తేల్చాలి. నా కూతురెప్పుడూ అభ్యంతరం చెప్పదు" అన్నది రాజులమ్మ.

ఆశపువీధిలో స్కూలుంది. చిన్న పిల్లలిద్దరికీ ప్రస్తుతానికి స్కూలుకు ఇబ్బంది లేదు. కొంచెం దూరం నిజమేగాని గోవిందరావుకి సైకిలుండనే వుంది. ఇక శిరీషకా? సెకండ్ హాండ్ సైకిలు కొంటే సరి! ఆ సైకిలేదో, పెన్షను డబ్బులీసుకున్నాక తానే కొనిస్తానన్నది రాజులమ్మ.

గోవిందరావు అందరి మాటలూ విన్నాక కాస్త మెత్తబడి సరే ఆలోచిద్దాం అన్నాడు. ఆ సాయంత్రానికి వరాలమ్మ నెల్లిమర్ల వెళ్లిపోయింది. నాలుగురోజులు కాస్త పచ్చం వంటబట్టి, రాజులమ్మ లేచి అటు యిటూ తిరుగుతున్నది. ఐదో రోజున ఉదయాన - గోవిందరావు కూడా ఆలకించేలాగ -

"ఇక నేను వెళ్తాను. ఎన్నాళ్లు మీ మీదపడి కూచుని తినేది" - "అన్నది రాజులమ్మ". "అదేం మాట. నీకు శరీరంలో సుస్తీవల్లనే కదా ఇక్కడున్నావు. నీ కూతురు అల్లుడూ మనవలూ నీకు పరాయివాళ్లు కాదుకదా" అన్నది మంగతల్లితో.

"నాకు ముందు సైకిలు కొనిస్తేనే గాని ఒప్పుకోను" అని శిరీష పేచీ పెట్టింది

"అలాగే కొనిస్తాను. మీ బళ్లో ఎవరి దగ్గరన్నా పాత సైకిలుందేమో కనుక్కో" అన్నది రాజులమ్మ.

"నాకు పాత సైకిలొద్దు. కొత్తదే కావాలి."

"పాతది కాదు. సరికొత్తదే. నేను భోగట్టా చేస్తాను కదూ - అమ్మమ్మ డబ్బులిస్తాది. మనిద్దరం కొనుక్కుందాం. సరేనా" అన్నాడు గోవిందరావు. ఆ మాటలకి మంగనవ్వింది. శిరీష కూడా సంబరపడిపోయింది. గోవిందరావు పన్లోకి వెళ్ళేక కబుర్లలో పడ్డారు. శిరీషకి సైకిలు కొందామన్నాడంటే - అందరం ఆశపువీధి ఇంట్లోకి వెళ్లడానికి ఒప్పుకున్నాడన్నమాటే కదా అనుకున్నారు.

అప్పన్నదొర ఆరోగ్యం అసలే అంతంతమాత్రంగా వుంది. గవర్నమెంట్ ఆస్పత్రికి వెళ్తే కాన్సర్ అని డాక్టర్ చెప్పాడు. ఎడ్వాన్సుడు కాన్సర్ అనికూడా చెప్పాడు. పౌర హక్కుల సంఘంవారు విరాళాలు సేకరించి ట్రీట్‌మెంట్ ఇప్పిస్తున్నారు. కాని ఎక్కువ కాలం గడవలేదు. ఒకరోజు రాత్రి చాలాసేపు దగ్గుతో బాధ పడ్డాడు. గబగబా రిక్షా మీద ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టరు - వెంటనే విశాఖపట్నం తీసుకువెళ్లండి ఆలస్యం చెయ్యొద్దని సలహా ఇచ్చాడు. అప్పటికప్పుడు టాక్సీ చేసి - కేజిహెచ్‌కి తీసుకెళ్లారు. మూడో రోజున అప్పన్నదొర మరణించాడు. ఆ సాయింత్రం బాడీని విజయనగరం తీసుకొచ్చారు. అభిమానులు ఒకరొకరే వస్తున్నారు. ఆ మర్నాడు అంతిమయాత్ర ఘనంగా జరిగింది. ఉత్తరాంధ్ర

నుంచి పౌర హక్కుల సంఘం, విప్లవ రచయితల సంఘం, మహిళా సంఘం, కార్మిక సంఘాలు - ఇలా అనేకులు వచ్చారు. పెద్ద సంస్మరణ సభ జరిగింది. విరాళాలు సేకరించి ఆయన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు నిర్ణయించారు. మరణించే సమయానికి దొరకు సుమారు డబ్బయి యేళ్లు ఉండొచ్చు. ఏ ఆస్తిపాస్తులూ లేవు. ఇల్లులేదు. పుస్తకాలు అమ్మేవాడు. విప్లవాభిమానులు అప్పుడప్పుడు కొద్దిపాటి సొమ్ము ఇస్తుండేవారు. ఆయన ఎన్ని కష్టాలైనా మౌనంగా అనుభవించాడు తప్ప ఏనాడూ ఎవరిదగ్గరా చెయ్యిచాపలేదు. ఎన్నిసార్లు అరెస్టయ్యాడో, ఎన్నిసార్లు లాఠీ దెబ్బలు తిన్నాడో తెలియదు. స్వంత కుటుంబం గురించి ఒక్కనాడూ ఆలోచించలేదు. యావజ్జీవితమూ ప్రజా ఉద్యమాల్లోనే గడిపాడు. గోవిందరావుకి అతని నుంచి స్ఫూర్తి తీసుకోవాలనిపించింది.

⋆⋆⋆

లావణ్య కేసుమీద పౌర హక్కుల సంఘం నాయకులు గట్టిగా పనిచేస్తున్నారు. నేరస్తులకు శిక్ష పడితీరాలని పట్టుదలగా ఉన్నారు. కాని ప్రభుత్వం పోలీసులూ, న్యాయవ్యవస్థ కూడా అవినీతిమయమై పుచ్చి పరుగులు కారుతుంది. లావణ్య అత్తమామలు బెయిలు మీద విడుదలయ్యారు. కేసును నీరిగార్చే ప్రయత్నాలు చేస్తున్నారు గాని లాయరు ఈ కేసును బాగా బలంగా తయారు చేశాడు. విడుదలచెయ్యడం తగదని, వాళ్లని మళ్లీ అరెస్టు చెయ్యాలని పిటిషన్ పెట్టాడు. ఈసారి నాన్ బెయిలబుల్ వారంట్ విడుదలయ్యే విధంగా రకరకాల సెక్షన్లు కింద కేసు పెట్టాడు. మహిళా సంఘం వాళ్లు, పౌరహక్కుల సంఘంతో చేతులు కలిపారు. ఇద్దరు కలిపి సమిష్టిగా పనిచెయ్యాలని - నేరస్తులకు శిక్ష పడేదాకా విశ్రమించకూడదనీ గట్టి నిర్ణయాలు చేసుకున్నారు. కేసులన్నీ సగం సగంలో నీరు కారిపోతుంటే, ఎవరికీ తగిన బుద్ధి చెప్పడం కుదర్డం లేదు. ఈ కేసులో నన్నా విజయం సాధిస్తే పూర్తి వివరాల్తో పెద్ద కరపత్రం వెయ్యాలన్న ఆలోచనలో ఉన్నారు. కాని - కేసు వాయిదాల మీద వాయిదాల పడిపోయి ఈడుస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం విద్యుచ్ఛక్తి చార్జీలు విపరీతంగా పెంచేసింది. ఇంతవరకూ వందరూపాయిలు కట్టేకుటుంబాలు ఇకపై నూటయనభై వరకూ కట్టాలి. నూట యాభై కడుతున్నవాళ్లు దాదాపు మూడొందలుకట్టాలి. సామాన్య గృహస్తులపై పెనుభారం పడింది. దీనిపై సర్వత్ర తీవ్ర నిరసన వ్యక్తమైంది. ముఖ్యమంత్రి ప్రపంచ బ్యాంకు తొత్తుగా తయారయ్యాడు. పెంచిన ఛార్జీలు తగ్గించేదా ఉద్యమం ఆగదని-ఉభయ కమ్యూనిస్టు పార్టీలూ గట్టి హెచ్చరిక చేశాయి. వివిధ ప్రతిపక్ష పార్టీల్తో ఒక ఐక్యకార్యాచరణ వేదిక తయారయింది.

పెరిగిన విద్యుచ్ఛక్తి ఛార్జీలతోపాటు - నిరుద్యోగం, సాగునీరు త్రాగునీరు, దళితులపై, మహిళలపై పెరుగుతున్న హింసాకాండ, బూటకపు ఎన్‌కౌంటర్లు మొదలైన అన్ని సమస్యలపైనా - ప్రకాశం పార్కులో - పౌరహక్కుల సంఘం పెద్ద సభ నిర్వహించింది. సభా ప్రాంగణం నుంచి గంటస్తంభం, కన్యకాపరమేశ్వరి కోవెల మీదుగా రైల్వేస్టేషను కలక్టరాఫీసు వరకూ భారీ ఊరేగింపు జరిగింది. వివిధ వామపక్ష పార్టీలూ

మహిళా సంఘాలూ, దళిత సంఘాలు చేరాయి. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా నినాదాలు మిన్ను ముట్టాయి. ఒక్కసారి విజయనగరం రోడ్లు ఎర్రజెండాలతో ఎరుపెక్కాయి.

గోవిందరావు ఇప్పుడు పౌరహక్కుల సంఘంలో ముఖ్యకార్యకర్త. ఏ చిన్న సమస్య వచ్చినా ముందుంటున్నాడు. ఈ సభకు వాల్ పోస్టర్లు అంటించాడు. ఊరంతా తిరిగి కరపత్రాలు పంచాడు. ఊరేగింపు ముందుభాగాన నిలిచి దిక్కులు మారు మ్రోగేలాగ నినాదాలిచ్చాడు, సంఘటిత పోరాటం మాత్రమే సమస్యలకు తగిన పరిష్కారం అనే అవగాహన పూర్తిగా ఏర్పడింది. తన జీవితాని కొక గమ్యం ఏర్పడింది ఇక ఆ గమ్యాన్నించి వెనుదిరిగేది లేదు చివరక్షణం వరకూ ఆ గమ్యంకోసంమే పనిచెయ్యాలని దృఢనిర్ణయాని కొచ్చాడు,

రాజులమ్మ ఇంట్లో అద్దెకుంటున్నవాళ్లు ఖాళీ చేసి వెళిపోయారు. ఇప్పుడా వాటాఖాళీ. ఇంటి మొత్తానికి రాజులమ్మ ఒక్కర్తే వుంటుంది. రెండో రోజు వచ్చి - కూతుర్నీ అల్లుడ్ని వచ్చెయ్యమని చెప్పింది. ఎవరయినా ఇల్లు అద్దెకడిగితే ఇక ఇవ్వనంది. ఒక వారం తరువాత ఇల్లు మార్చెయ్యాలని నిర్ణయించుకున్నాడు గోవిందరావు.

ఇంతలో తుఫాను పట్టుకుంది. రాష్ట్రం యావత్తూ వరదల్తో అతలాకుతలం అయిపోయింది. కృష్ణా, గుంటూరు,నెల్లూరు జిల్లాలు అత్యధికంగా దెబ్బతిన్నాయి. ఉత్తరాంధ్రలో కూడా భారీ వర్షాలు పడ్డాయిగాని - మరీ అంత ఉధృతి లేదు.

విద్యుత్ పోరాటం సాగుతూనే వుంది. మునగదు, తేలదు. ప్రభుత్వం మాత్రం దిగిరాలేదు. పెంచిన ధరలు ఎంతమాత్రం తగ్గించేది లేదని మొండి పట్టుదలగా ఉన్నాడు ముఖ్యమంత్రి. అతనికి వెనక ప్రపంచ బ్యాంకు మద్దత్తుంది. పైగా ఆ మధ్య అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ వచ్చి వెళ్లాడు. అప్పట్నొంచి ముఖ్యమంత్రి మరింత బలోపేతంగా తయారయ్యాడు. నిర్ణయాలన్నీ వరల్డ్ బ్యాంకు, అమెరికా ఆదేశాలమేరకే జరుగుతున్నాయి. వాళ్ల దన్ను వున్నంతకాలం ఈ ముఖ్యమంత్రిని ఎవ్వరూ కదిలించలేరు.

అన్ని జిల్లా కేంద్రాల్లో రిలే నిరాహారదీక్షలు జరుగుతున్నాయి. విజయనగరం లోకూడా కలెక్టరాఫీసు ఎదురుగా టెంట్‌వేసి రిలే నిరహార దీక్షలు ప్రారంభించారు. ఒక రోజు గోవిందరావు కూచున్నాడు. శిబిరం దగ్గర నెల్లిమర్ల జూటుమిల్లు కార్మికుడొకడు కలిశాడు. అతను కూడా టౌనులోనే ఎక్కడో వర్క్ షాపులో లేత్ మిషన్ దగ్గర పనిచేస్తున్నాడట. ఇక నెల్లిమర్ల మిల్లు తెరవడం వుత్తి మాటేనని చెప్పాడు. యాజమాన్యం, పాలకవర్గాల స్వార్థం, నయవంచనవల్ల వందలాది మంది కార్మికులు మోసపోయారు. యాజమాన్యం అవినీతి అధికారులు, పాలకవర్గ గుండాల అండచూసుకొని కార్మికుల పొట్టలమీద కొట్టింది.

ఆ రోజు రిలే నిరాహార దీక్ష శిబిరం నుంచి యింటికి వచ్చేసరికి చాలా నీరసంగా వుంది. గోవిందరావుతో పాటు మరొక ఐదుగురు కూచున్నారు. పోలీసులు వచ్చారు. ఎందుకొచ్చిన నిరాహారదీక్ష - విరమించుకొండన్నాడు ఒక మఫ్టీ పోలీసు. కొంత వాగ్వాదం జరిగింది. పోలీసులు పాలకవర్గ ఏజంట్లు,

ప్రజలకు పూర్తిగా వ్యతిరేకులు అన్న సంగతి గోవిందరావుకు మరోసారి ప్రత్యక్షంగా అర్థమైంది. ఇంటకి వస్తూనే వేడినీళ్లు పెట్టించుకుని స్నానం చేశాడు. ఇంత అన్నం తిన్నాడు. ముందుగదిలో చిన్నకూతురు శ్రీలక్ష్మితో ఆడుకుంటూ అలాగే పడి నిద్రపోయాడు. పగలంతా ఏం తినకపోవడంవల్ల నీరసంతో మైకం కమ్మి నట్టయింది. నిద్రముంచుకొచ్చి మంచానికడ్డంగా పడి నిద్రపోయాడు. చిన్న కూతురు తండ్రి వీపుమీద కెక్కి నిద్రపోయింది.

కరెంటు ఛార్జీల పెరుగుదలవల్ల తమ షెడ్డుకు కూడా ఆర్థిక భారం పెరుగుతుంది. ఇప్పటికే నెలకువెయ్యి, పన్నెండువందలు - ఇలా కడుతున్నారు. ఇకపై అది దాదాపు మూడువేలు కావచ్చు. కనుకనే శివకోటి వారు కూడా ఈ ఉద్యమాన్ని బలపరుస్తున్నారు. తమ వర్క్‌షాపు కార్మికులు కూడా ఈ ఉద్యమంలో పాల్గొవడాన్ని ప్రోత్సహిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని విద్యుత్ ఛార్జీలు పెంచమని మేమే చెప్పామని వాషింగ్‌టన్‌లో ప్రపంచబ్యాంకు డైరక్టరు ప్రకటించాడు. మరొకపక్క తెలుగు దేశం మిత్రపక్షమైన భారతీయజనతాపార్టీ రాష్ట్రశాఖ - విద్యుత్ చార్జీలు పెంచినందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పు పట్టింది. ఇతర రాష్ట్రాల్లో విద్యుత్ చార్జీలను ఒక పట్టికగా - తమ పత్రిక కమలవాణిలో - ప్రచురించింది. అన్ని రాష్ట్రాలకంటె మనరాష్ట్రంలోనే కరెంటు రేట్లు ఎక్కువ అని తన వాదాన్ని గణాంక వివరాల్తో సహా నిరూపించింది. కరెంటు చార్జీలు పెరగడానికీ, ప్రపంచ బ్యాంకుకీ ఏం సంబంధం లేదనీ, మేం ప్రపంచబ్యాంకు ఏజంట్లం అనడం తప్పుడు ఆరోపణంటూ వాదిస్తూ వచ్చిన రాష్ట్రప్రభుత్వం - ఇరుకున పడింది. ప్రతిపక్షాలన్నీ - ఛార్జీలు తగ్గించమని - ముక్తకంఠంతో రాష్ట్రాన్ని అడుగుతున్నయి.

అప్పన్నదొర మరణానంతరం ఆయన భార్య స్వరాజ్యం పుస్తకాల షాపు కనిపెట్టుకుని కూచుంటున్నది. ఆమె కూడా భర్తతోపాటు వామపక్ష ఉద్యామాల్లో పనిచేసిన మనిషి అనేకసార్లు లాఠీ దెబ్బలుతిన్నది. అరెస్టులయింది. స్వేచ్ఛ, అరుణతార, ప్రజాసాహిత, జనపథం, విమోచన, ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, ఫ్రాంటీయర్, సెమినార్ మొదలైన పత్రికలన్నీ అక్కడికొస్తాయి. ఆదివారం పొద్దు పోయే వరకు అప్పన్నదొర పుస్తకాల షాపులోనే కూచుని మిత్రులందరూ ఈ ఉద్యమవార్తలు చర్చించారు ఆ మర్నాడు.

ఆగష్టు నెల. హైదరాబాద్‌లో బషీర్‌బాగ్ విద్యుత్ చార్జీ పెంపుకి వ్యతిరేకంగా తొమ్మిది రాజకీయపక్షాలు సమైక్యంగా చేస్తున్న ధర్నాపై విచక్షణారహితంగా ఏ ముందు హెచ్చరికలు లేకుండా పోలీసులు కాల్పులు జరిపారు. మిలట్రీ గుర్రాల్ని మనుషులమీదికి తోలారు. ముగ్గురు యువకులు, వామపక్షాల చెందిన కార్యకర్తలు, మరణించారు. అనేకమంది వృద్ధనాయకులు,యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ వార్త అన్ని టీవీ ఛానల్స్ ప్రసారం చేశాయి. రాజధానినగరం అట్టుడికి పోయింది.

లోగడ ఇలాగే సమస్యల పరిష్కారం కోసం ధర్నాచేసిన అంగన్‌వాడీ కార్యకర్తల మీదకూడా గుర్రాలు తోలారు. అవి ఏం గుర్రాలు? ఆగస్టు 15, జనవరి 16 వంటి సందర్భాల్లో సైనిక వందనం,

కవాతు చెయ్యడానికి ఉపయోగించే రక్షణశాఖ వారి గుర్రాలు. నిజానికి వాటిని దేశరక్షణ, దేశగౌరవం మొదలైన సందర్భాంల్లో మాత్రమే ఉపయోగించాలి. మరి ఇవ్వాళ ఆ సైనిక గుర్రాలు, రక్షణశాఖ గుర్రాలు ఎవర్ని రక్షిస్తున్నట్టు? పాలకవర్గాల్ని రక్షించి, సమస్యల కోసం నోరువిప్పిన నిరుపేద ప్రజల్ని శిక్షిస్తున్నాయి, ఇదీ ఈనాడు మన దేశంలో ఉన్న ప్రజాస్వామ్యం తీరు!

డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ - ఉత్తరాంధ్ర విభాగం రేపు రాబోయే సెప్టెంబర్‌లో ఉపాధ్యాయదినోత్సవాన్ని బహిష్కరించాలని నిర్ణయించింది. ఆ రోజు మంగళవారం. ఆ రోజు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలనీ, ప్రభుత్వదివాలా కోరు విధానాన్నీ, దోపిడీ పాలననీ నిరసిస్తూ సదస్సులు జరపాలని కూడా నిర్ణయించింది. సెప్టెంబర్ 5 సాయంత్రం - ఆశీలు మెట్ట సమీపంలోని వేమన మందిరంలో సదస్సు జరగనున్నది. కృష్ణమూర్తి ఆ సదస్సు కోసం చురుగ్గా పనిచేస్తున్నాడు.

ఈ మధ్య రాజులమ్మ ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నది. ఇక లాభం లేదు. ఇల్లు మార్చెయ్యాలని నిర్ణయించుకున్నారు. ఒక సోమవారం సాయంత్రం నాలుగురిక్షాలు పిలిచి సామాను ఎక్కించి ఆశపువీధిలో ఉన్న యింటికి వెళ్లారు. ఆ రోజు రాజులమ్మ ఆనందం అంతా ఇంతాకాదు. ఇల్లంతా సందడిగా వున్నారు. కూతురూ, అల్లుడూ మనుమలూ కళ్లముందు తిరుగుతుంటే తనకు ఏ అనారోగ్యమూలేనట్టే చలాకీగా తిరిగింది. మర్నాడు శిరీషకి అయిదువందల ఎనభైరూపాయలు పెట్టి ఒక సెకండ్ హాండ్ సైకిలుకొనిచ్చింది రాజులమ్మ.

లావణ్య అత్తమామల్ని అరెస్టు చేశారు. ఇద్దరికీ ఏడేసి సంవత్సరాలు జైలుశిక్ష పడింది. భర్తకి మూడేళ్లు శిక్షపడింది. మొత్తానికి మహిళాసంఘం విజయం సాధించింది. లావణ్య కేసు పూర్వాపరాల్తో నాలుగు పేజీల కరపత్రం రెండు వేల కాపీలు వేసింది. మంగ కూడా తీరుబడి చేసుకుని ఆ కరపత్రం చదివింది.

బ్రాహ్మణ పొరుగు తప్పినందుకు, అద్దె యింట్లోంచి స్వంతయింట్లోకి వచ్చినందుకూ - మంగ చాలా సంతోషించింది. తినే తిండికి కూడా జడవడం, తగువులు పడటం అసహ్యం అనిపించింది. శాకాహారులందరూ మంచి వాళ్లనీ, గొప్పవాళ్లనీ ఎందుకనుకోవడం మనుషుల స్వభావాలు ఆహారాన్నిబట్టి, కులాన్ని ఉంటాయనుకోవడం అంత మూర్ఖపునమ్మకం మరి వుండదు. అక్కడున్నన్నాళ్లూ చేపల కూరవండుకోవాలంటే పొరుగునున్న బ్రాహ్మణులు చిచ్ఛీ వాసన కంపు కంపు అని ఒకటే గొడవ పెట్టేవాళ్లు. ఇప్పుడా గొడవ తప్పింది. నెలతిరిగే సరికి యింటికి అద్దె ఇచ్చుకోవాలన్న భయం లేదు. ప్రాణం స్థిమితంగా వుంది.

వాతావరణం పొడిగా వుంది. ఎండ నిలబడి కాస్తోంది. కొంచెం ఉక్కగా వుంది. రాజులమ్మకి ఆరోగ్యం బాగుంది. పిల్లల్తో మంచి కాలక్షేపం పిల్లలక్కూడా బడినుంచి రాగానే అమ్మమ్మతో కబుర్లూ, కధలూ - పరిస్థితి బాగుంది.

"అమ్మమ్మా - మనం టీవీ కొనుక్కుందాం" అన్నది శిరీష. కోట్ల మాదప్పవీధిలో అద్దెయింట్లో ఉంటున్నప్పుడు అక్కడ మేడమీద యింట్లో టీవీవుంది. కలర్ టీవీ. అప్పుడప్పుడు శిరీషా వాళ్లు వెళ్లి

చూసేవారు. ఇక్కడ ఆ సౌకర్యం లేదు. ఇల్లు చిన్నదే అయినా ఎదరా వెనకా చిన్న కాంపౌండ్ వాల్ ఉన్నది. గేటు తీసుకుని వెళ్తేతప్ప - మరో యింటికి వెళ్లడం టీవీ చూడటం కుదరదు.

"ఇన్‌స్టాల్‌మెంట్ మీద చిన్న టీవీ కొనుక్కుందాం. ఎంత వుంటాదో, ముందు ఎంత కట్టాలో నాన్నని కనుక్కోమను" అన్నది రాజులమ్మ.

"కలర్ టీవీపేద్దది కొనాలి" అన్నది శిరీష, ఆశగా

"అబ్బే కలర్ టీవీ చాలా ఖరీదుంటాది - వద్దులే - చిన్నది బ్లాక్ అండ్ వైట్ టీవీ కొనుక్కుందాం - సరేనా-" అన్నది పక్కనే ఉన్న మంగ . పిల్లలు సంతోషంతో చప్పట్లు కొట్టేరు.

★★★

సెప్టెంబర్ 5, ఉపాధ్యాయదినోత్సవం.

డెమొక్రాటిక్ టీచర్స్ ఫెడరేషన్ తదితర సంఘాల సమాఖ్య ఉపాధ్యాయదినోత్సవాన్ని బహిష్కరించింది. నిరసన పాటిస్తూ ఈ రోజు నల్లబ్యాడ్జీలు పెట్టుకున్నారు. డిటీఎఫ్ సభ్యుల్లో ఇద్దరికి రాష్ట్రప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రకటించింది. కాని వారు ఆ అవార్డుల్ని తిరస్కరించారు.

ప్రకాశం పార్కులో ఉపాధ్యాయ సంఘం, విప్లవ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆరోజు సాయంత్రం బహిరంగసభ జరిగింది. సభ ప్రారంభమయ్యే సమయానికి న్యూపూర్ణా, కృష్ణా సినీమా, ఆపక్కనున్న ఓల్డ్‌పూర్ణా (ఇప్పుడు దాని పేరు మారినట్టుంది) సినీమా హాళ్లల్లో మేట్నీ విడిచిపెట్టేరు. ఆ సినీమాజనంలో కొందరు సభకు వచ్చారు.

రాష్ట్ర దివాలాకోరు విధానాలు - నిరసించండి

పెంచిన విద్యుత్ ఛార్జీలు - తగ్గించాలి

ఉపాధ్యాయ - ఉద్యోగ - విద్యార్థి - కార్మిక - ఐక్యత వర్ధిల్లాలి

ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ - వ్యతిరేకించండి.

- మొదలైన నినాదాల్తో సభ దద్దరిల్లింది. గోవిందరావు స్టేజీదగ్గిర నిలబడి గొంతెత్తి పిడికిలి బిగించి నినాదాలిస్తున్నాడు. నిన్నా, మొన్నా కరపత్రాలు పంచాడు. రాత్రి వేళల్లో నలుగురు కుర్రాళ్లను వెంటబెట్టుకుని వెళ్లి వాల్‌పోస్టర్లు అంటించాడు. జనాల్ని బాగా సమీకరించాడు.

వక్తలు ప్రభుత్వ విధానాల్ని తీవ్రంగా దుయ్యబట్టారు. అమెరికా జోక్యాన్ని, ప్రపంచబ్యాంకునీ - ఎండ గట్టారు. ఇంతలో పోలీసులు ఒక పదిమంది వరకూ వచ్చారు. తిన్నగా స్టేజి దగ్గిరికి కూడా వచ్చారు. కాస్సేపు - నాయకుల్ని, నిర్వాహకుల్ని, అరెస్టు చేస్తారేమోనన్న ఉద్రిక్తత ఏర్పడింది. లాఠీలు ఊపుకుంటూ అటుయిటూ తిరిగారు. వాళ్లనీ వీళ్లనీ అడిగి వక్తల పేర్లు రాసుకున్నారు. గోవిందరావు పేరూ, భాస్కర్రావు పేరూ ముందే తెలుసును. హడావిడి చేస్తూ అటు ఇటూ కలదిరిగారు గాని ఆఖరికి

ఏమీ చెయ్యకుండా వెళిపోయారు. అయితే కొందరు సామాన్యప్రజలు పోలీసుల్ని వాళ్ల అనుమానపు, కరకు చూపుల్ని చూసి జంకిపోయి, జారుకున్నారు. పోలీసులకి కావాలసిందీ అదే ఉద్యమకారుల కదలికల్ని కనిపెట్టి వాళ్లమీద ఒక చూపువేసి వుంచడం, సామాన్య ప్రజల్ని తమరాకతో భయకంపితుల్ని చెయ్యడం-

మొత్తానికి సభ జయప్రదంగానే ముగిసింది.

గోవిందరావు ఇల్లు చేరుకునే సరికి పదిదాటింది. వస్తూనే గబగబ స్నానంచేసి, ఇంత అన్నం తిని పడుకున్నాడు. ఆ రాత్రి చాలాసేపు విద్యుత్‌కోత. సరిగ్గా నిద్రపట్టే సమయానికి కరెంటుపోవడం, దోమలు ఒకటే వళ్లంతా కుట్టేశాయి. ఇంట్లో ఎవ్వరూ సరిగ్గా పడుకోలేదు. తెల్లవారు జాము మూడూ నాలుగు ప్రాంతాల్లో నిద్రపట్టింది. అప్పటికీ కరెంటు రాలేదు. ఉదయం లేచేసరికి కళ్లు మండుతున్నాయి. వళ్లంతా నొప్పులు తొందరగా మంచం దిగలేకపోయేడు. కష్టం మీద లేచి - బాత్‌రూంకి వెళ్లొచ్చి మళ్లీ పడుకున్నాడు. తొమ్మిది దాటిపోయింది.

మంగవచ్చి తట్టి లేపింది. వొళ్లు కాలిపోతోంది జ్వరం వచ్చేసింది. చలీ కుదుపూ. దుప్పటి కప్పింది. గోవిందరావు కళ్లుతెరిచి - మంగతోటి వేసుకోవలసిన మాత్రలపేర్లు చెప్పాడు. గబగబా పాతబస్టాండు దగ్గిరున్న మెడికల్ షాపుకు వెళ్లి మాత్రలు తీసుకొచ్చింది. ఓపిక తెచ్చుకుని లేచి - మొహం కడుక్కుని - ఒక మాత్ర మేసుకుని, ఇంత కాఫీ తాగిపడుకున్నాడు. వళ్లంతా నొప్పులుగా వున్నాయంటే - దగ్గిర కూచుని వళ్లూ, కాళ్లూ పట్టింది.

మీటింగ్ ఏర్పాట్ల కోసం గతమూడు నాలుగు రోజులూ బాగా తిరిగాడు. రాత్రిళ్లు కూడా కుర్రాళ్లని వెంటబెట్టుకుని వెళ్లి వాల్‌పోస్టర్లు అంటించారు. శరీరం బాగా అలిసి - జ్వరం వచ్చివుంటుంది. పైగా ఈ మూడురోజులూ వేళాకి తిండి నిద్రా కూడా లేవు. మధ్యాహ్నం బార్లీజావతాగి, ఆల్‌బకరా కాయబుగ్గన పెట్టుకున్నాడు. మూడు గంటలప్పుడు మళ్లీ ఇంకోమాత్ర వేసుకుని కాఫీ తాగాడు. సాయంత్రం ఆరుకావొస్తోంది. శీతగాలి తిరిగినట్టుంది. భాస్కర్రావొచ్చాడు. జ్వరం కొంచెం దిగింది. కాని నోరంతా చేదుగా, వొళ్లంతా నొప్పులుగా, పరమ నీరసంగా వుంది.

పడుకుని వున్న గోవిందరావునుచూసి పరిస్థితి అర్థం చేసుకుని, ఇప్పుడే వస్తానని వెళ్లి నాలుగు బత్తాయిలూ, ద్రాక్షపళ్లూ తెచ్చాడు.

"ఇవ్వాళ నువు పనిలోకి రాకపోతే - విశేషం ఏమిటో చూసివెళ్దామని వచ్చాను. సూర్యారావు కూడా రాలేదు. చాలా పని ఆగిపోయింది. లేలెండు లారీ ఒకటొచ్చింది. రిపేర్లు చేసి, పెయింటింగ్ చేసి పంపాలి" అన్నాడు, భాస్కర్రావు తెచ్చిన పళ్లు పక్కనున్న బలమీద పెడుతూ.

మంగ వచ్చి గుమ్మం పక్కన, పెనిమిటికి దగ్గిరగా నుంచుంది

" ఈ మూడురోజులూ పనులమీద తిరిగావు కదూ - వొళ్లు అలిసి జ్వరం వచ్చివుంటుంది."

గోవిందరావు మెల్లిగా లేచి మంచం మీద కూచున్నాడు. మంగ భాస్కర్రావుకు టీయిచ్చింది. రాజులమ్మ వంట చేస్తోంది. శిరీష హోంవర్కు చేసుకుంటుంది. పిల్లలు ఆటలకోసం వీధిలోకి వెళ్లారు.

కాస్సేపు ఈ మాటా ఆ మాటా చెప్పి వెళ్లిపోయాడు భాస్కర్రావు. రాత్రి మళ్లీ చలీకుదుపుతో జ్వరం వచ్చింది. మర్నాడు పెనిమిటిని కటకం డాక్టరు దగ్గిరికి తీసుకువెళ్లింది మంగ. డాక్టరు తణిఖీ చేసి, మందులు రాసిచ్చాడు. ఇంజక్షన్ చేశాడు. జ్వరం 101 వుంది. అన్నం తినొద్దని చెప్పాడు. రొట్టె, బార్లీ, పాలు, పళ్లరసం తీసుకోవాలన్నాడు. సాయంత్రానికి జ్వరం తగ్గింది. కాని వళ్లమాలిన నీరసం.

పోస్టులో స్వేచ్ఛ పత్రిక వచ్చింది. మంచం మీద పడుకునే చదివాడు. ఒంగోలులో లాకప్‌డెత్. తెలంగాణాలో ఎన్‌కౌంటర్లు - చీరాలలో వరకట్న మరణం ప్రపంచబ్యాంక్ విధానాలపై ప్రత్యేక వ్యాసం - ఢిల్లీ పౌరహక్కుల మహాసభల విశేషాలు - పత్రిక చదువుతూ చాలా అసహనంగా ఫీలయ్యాడు. కర్ణాటకలో సినీనటుడు రాజ్‌కుమార్‌ను వీరప్పన్ అపహరించిన వార్త పెద్దగా ఆసక్తి కలిగించలేదు. ఈ మధ్య కొంత కాలంగా ఆ వార్త నలుగుతూనే వుంది.

దేశంలో పరిస్థితులు చాలా అస్తవ్యస్తంగా వున్నాయి. ఇప్పుడున్న ప్రజా ఉద్యమాలు చాలవు. ఇంకా ఇంకా పనిచెయ్యాలి. ఒక పక్క అమెరికన్ సామ్రాజ్య వాదం భారతదేశాన్ని కబళిస్తోంది. నిజానికి ఈ దేశపాలక వర్గాలు ఏనాడో అమెరికన్‌లకు తాకట్టు పడిపోయారు. గట్(GATT) ఒప్పందం బడుగు దేశాల ఆర్థిక విధానాల్ని సంక్షోభంలో పెట్టింది. టెర్మినేటర్ విత్తనాలు దేశంలో ప్రవేశించాయి. కర్ణాటకలో ప్రొఫెసర్ నంజుండయ్య కర్ణాటక రైతుసంఘం స్థాపించి ప్రజాపోరాటం నిర్మిస్తున్నాడు. రైతులు విత్తనాలగోడౌన్లపై దాడులు చేశారు. నర్మదా బచావ్ ఆందోళన సాగుతునేవున్నది. మేధా పాట్కర్ ఆమె సహచరులు పదహారు గంటలసేపు పీకలలోతు నీళ్లల్లో గడిపి తమనిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదు, కేంద్రంలో ఉన్న బి.జే.పి. ఎంత సేపూ - ఎలా దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలా అన్న ఆలోచనతో ఉంటున్నది. గుజరాత్‌లో క్రిస్టియన్లపై. గిరిజనులపై దాడులు చర్చిలపై దాడులు - హిందూ మతోన్మాదాన్ని ప్రభుత్వం నేరుగా బలపరుస్తున్నది. ఒరిస్సాలో క్రైస్తవ మతగురువు స్టీన్స్ అతని కుమారుడు జీపులో రాత్రి వేళ సజీవదహనమయ్యారు.

మూడు రోజులుగా ఏ పని లేకుండా జ్వరంతో మంచంలో పడుకునే సరికి గోవిందరావు బుర్రనిండా రకరకాల ఆలోచనలు ముసిరాయి. విప్లవ పార్టీతో సంబంధం పెట్టుకోవాలి. విప్లవ సిద్ధాంతం ఇంకా ఇంకా బాగా అధ్యయనం చెయ్యాలి. పార్టీలో చేరి పోరాడాలి.

మెల్లిగా లేచి టేప్‌రికార్డ్ తీసి సుబ్బారావు పాణిగ్రహి, వంగపండు, గద్దర్ పాటలు విన్నాడు గద్దర్ పాటలు వింటుంటే గద్దర్ సంగతి గుర్తొచ్చింది. అతని మీదకూడా హత్యా ప్రయత్నం జరిగింది. నేరస్తుల్ని పట్టుకోనేలేదు. రాను రాను ప్రభుత్వం ఎలావుందంటే - గుండా వర్గాల పెత్తందారీతనంగా వుంది. ఇందులో ప్రజలు లేరు. ప్రజాస్వామ్యం లేదు. అధికారం చలాయించడం, కోట్లకి కోట్లు ప్రజాధనం దిగమింగడం - ఎదురు తిరిగి అడిగిన వాడిని చంపడం -

ప్రజా ఉద్యమాల ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారమౌతాయి. కరపత్రాలు, నిరాహారదీక్షలూ, మీటింగ్‌లూ, మహజర్లు మెమోరాండాలు సమర్పించడం - ఇవన్నీ చెప్పుకోదగిన ఫలితాల నివ్వవు.

మిలిటెంట్ పోరాటాలు కావాలి. ప్రజలు సాయుధులు కావాలి. తనొక్కడే మారితే చాలదు. మొత్తం కుటుంబం మారాలి. మంగకి ఇప్పుడిపుడే ఒక్కొక్క సంగతే బోధపరుస్తున్నాడు. ఇంకా అన్ని సంగతులూ చెప్పి, విప్లవసిద్ధాంతం బాగా మారిపోయ్యాలి. విప్లవసాహిత్యం చదివించాలి. కాని - తన తల్లికి, అత్తగారికీ ఈ సంగతులేం తెలియవు. తన పిల్లల్ని కూడా క్రమంగా ఈ మార్గంలో పెట్టాలి. విప్లవభావాలు ఇప్పట్నించీ నూరిపోసి మంచి కార్యకర్తలు ఉద్యమకారులుగా తయారుచెయ్యాలి.

మధ్యాహ్నం బార్లీజావతిని, ఇన్ని పాలు తాగాడు. మంగ బత్తాయి పళ్ల రసం తీసి తీసుకొచ్చింది. కూచోబెట్టి "స్వేచ్ఛ" పత్రికలో సంగతులన్నీ చెప్పాడు.

* * *

జ్వరం తగ్గింది. నాలుగోరోజున డ్యూటీకి వెళ్లాడు. ఆరోజు సాయంత్రం మామూలు కంటె కొంచెం ముందువచ్చాడు. బ్రెడ్ తిని టీ తాగి కూచున్నాడు. హఠాత్తుగా పోలీసులొచ్చారు. రాజులమ్మ, మంగ కంగారు పడ్డారు. గోవిందరావు ఈ పరిణామాన్ని ఊహించలేక పోయాడు. ఒక్కక్షణం ఏం అర్థం కాలేదు. తనకిదంతా మొదటిసారి, స్టేషనుకు పదమన్నారు.

"ఎందుకు - " అన్నాడు మామూలుగా, గొంతులో కంగారు కనపడకుండా విశ్వప్రయత్నం చేశాడు. కాని కంగారుపడుతున్నట్లు తెలుస్తూనేవుంది.

"ఎస్సయిగారు రమ్మన్నారు"

"దేనికి"

"ఏమో - మాకేం తెలుసూ - నిన్ను అర్జంటుగా తీసుకురమ్మన్నారు"

మంగ భయం భయంగా అంతా వింటునేవున్నది.

"ఆయనకి వొంట్లో బాగోలేదు. ఇవ్వాళే పథ్యం తిన్నారు. నాలుగు రోజుల్నించీ జ్వరం - వొంట్లో బాగోలేదు - " అన్నది మంగ

"మా కదంతా ఏం తెలీదు. ఉన్న పళాన తీసుకురమ్మన్నారు"

గోవిందరావు ఏదో మాట్లాడబోయాడు.

"ఎక్కువమాట్లాడకుండా మావెంట స్టేషనుకు రా" అన్నాడొక కుర్రపోలీసు చాలా కోపంగా, అధికారికంగా. ఘర్షణపడి లాభం లేదని తెలిసిపోతూనేవుంది. వెళ్లక తప్పదు. రాజులమ్మ" లోపల్నించి వొచ్చి వొంట్లో బాగోలేదునాయనా " అన్నది గాని వచ్చిన పోలీసులు మొహం తిప్పుకున్నారు. ఇంకా ఆలస్యం చెయ్యకు. బయల్దేరు. లేకపోతే మా పోలీసు బలం ఏమిటో చూపిస్తా జాగ్రత్త అన్నట్టున్నాయి వాళ్ల చూపులు.

మరేం కంగారు పడొద్దనీ, భాస్కర్రావుకీ, సూర్యారావుకీ కబురు పెట్టమనీ చెప్పి - బయల్దేరాడు గోవిందరావు. మంగకు ఏడుపొచ్చేసింది. ఒక్కసారి భళ్లున ఏడ్చేసింది. రాజులమ్మ పట్టుకుంది.

పిల్లలుకూడా ఏడుస్తున్నారు. అంతా గందరగోళంగా, భయం భయంగా, ఆందోళనకరంగా తయారయింది వాతావరణం. లేచి కళ్లు తుడుచుకుని భాస్కర్రావువింటికీ, సూర్యారావు యింటికీ కబుర్లు చేసింది మంగ భాస్కర్రావు యింట్లో లేడట. మొత్తానికి ఇంటికి రాగానే భాస్కర్రావుకి సంగతి అర్థమైంది. రాత్రి పదిగంటల సమయంలో పోలీసు స్టేషనుకు వెళ్లాడు.

విప్లవ పార్టీతో సంబంధాలున్నాయనీ పార్టీ కరపత్రాలు పంచుతున్నాడనీ, గోడలమీద ప్రభుత్వ వ్యతిరేక నినాదాల రాస్తున్నాడనీ, ఇవన్నీ చట్టవిరుద్ధమైన నేరాలనీ అరెస్టు చేస్తున్నామనీ చెప్పారు పోలీసులు భాస్కర్రావు అదేం లేదని ఎంత చెప్పినా వినలేదు. నువ్వెడివి మధ్య! అని ఎగిరాడు ఎస్సయి. ఆ రాత్రి తెల్లవార్లూ వేసిన ప్రశ్నలే వేశారు. విసిగించేశారు. ఫలానావాడు నీకు తెలుసా? పార్టీలో ఎన్నాళ్లయింది చేరి ఫలానా రోజు నువ్వెక్కడున్నావు? ఇవిగో ఈ కరపత్రాలు పంచావా?

ఆ కరపత్రాలు నేను పంచలేదన్నాడు. అవి నిషిద్ధ విప్లవపార్టీ కరపత్రాలు కావు. విప్లవ రచయితల సంఘం - సామ్రాజ్యవాద వ్యతిరేక సదస్సు నిర్వహించినపుడు వేసిన కరపత్రాలు - వీటిపై నిషేధం లేదు. విప్లవ రచయితల సంఘం నిషేధిత సంస్థ కాదన్నాడు. ఆ రోజున నేను జ్వరంతో ఇంట్లో పడుకున్నాను. మీరు చెప్పిన వాళ్లెవరూ నాకు తెలీదు, నాకు విప్లవ పార్టీతో ఏ విధమైన సంబంధాలూ లేవని చెప్పాడు.

పోలీసులకు కావాల్సిన సమాధానాలు అవికావు.

అవే ప్రశ్నలు మళ్లీ మళ్లీ అటు తిప్పి ఇటుతిప్పి మార్చి మార్చి వేశారు.

నాకేం తెలియదు. పార్టీ సంగతి నాకేం తెలియదు - ఇదీ గోవిందరావు సమాధానం. తెల్లగా తెల్లవారింది. నిన్న రాత్రి భోజనం చెయ్యలేదు. పైగా జబ్బుపడి నీరసంగా వున్నాడు. కళ్లు మండిపోతున్నాయి. బాత్‌రూంకి వెళ్లొచ్చి ఒక గ్లాసుతో నీళ్లు తీసుకొని నోరుపుక్కిలించుకున్నాడు. ఏడు గంటల ప్రాంతంలో టీ వచ్చింది. పంచదార చాలా ఎక్కువగా వుంది. పానకంలావుంది. నీరసం మీద, ఖాళీ కడుపుమీద టీ తాగేసరికి కళ్లు తిరిగినట్టయింది. వాంతి వచ్చినట్టయింది. కళ్లుమూసుకుని గోడకి చేరబడ్డాడు. ఎనిమిదవుతుండగా భాస్కర్రావొచ్చాడు. వెళ్లి నాలుగిడ్లీ - టీ తెచ్చి ఇచ్చాడు. అవి తినేసరికి కాస్త శక్తి వచ్చినట్టయింది.

భాస్కర్రావు, వెంట సూర్యారావు యిద్దరూ వచ్చారు. మంగ చాలా గాభరా పడుతోంది, ఏడుస్తోంది అని చెప్పాడు. పొద్దున్నే వెళ్లి ధైర్యం చెప్పి వచ్చాడట. పరిస్థితి చూసి లాయరిని కలిసి బెయిలు పిటిషను పెట్టాకొస్తానన్నాడు. పది గంటలు కావొస్తుండగా సర్కిలిన్‌స్పెక్టరొచ్చాడు. ఎర్రగా పొడుగ్గా పల్చగావున్నాడు. నవ్వుతున్న పులిలా వున్నాడు. మళ్లీ వేసిన ప్రశ్నలే వేశాడు. పక్కనున్న ఫయిల్లో ఏదేదో చాలా చాలా రాశాడు. పదయింది, పదకొండయింది. ఫోటో గ్రాఫరు వచ్చాడు. రెండు మూడుకోణాల్లో ఫోటోలు తీశాడు. ఒక పుస్తకంలో వేలిముద్రలు తీసుకున్నారు. ఏవేవో ఫారాలు రాసి సంతకాలు పెట్టమన్నారు రిజిస్టరులో కూడా సంతకాలు చేయించుకున్నారు.

'పని చేసుకు బతకవలసినవాడివి. ఏదో పెద్ద గవర్నమెంటాఫీసర్ననుకోకు. కొంచెం జాగ్రత్త మీదుండు. వాళ్ళ దగ్గిర పెట్టుకుని మసులుకో. పెళ్లాంపిల్లలున్నారంటున్నావు. ఎందుకొచ్చిన పన్లు నీకు. నక్సలైట్ల ఊసునీకెందుకు? అసలు నిన్ను కొండల్లోకి తీసుకుపోయి కాల్చి చంపేస్తే ఏం చెయ్యగలవు? మీ ఊరేగింపులూ, కరపత్రాలూ, ధర్నాలూ, రాస్తారోకోలు మా ఈక తెంపలేవు. ఇదే మొదటి సారంటున్నావు. జాగ్రత్త.. జాగ్రత్త... పోలీసు దెబ్బ నీకింకా తెలిసినట్టు లేదు." అంటూ చాలా ఘోరమైన బూతుల భాషలో వార్నింగిచ్చాడు సర్కిలినస్పెక్టరు. నవ్వుతూనే పీకలు కొరికెయ్యగల క్రూరజంతువులా వున్నాడు. ఎర్రగా పల్చగా అందంగా ఉన్నాడు. మొహంలో నవ్వు చెదరదు. భాస్కర్రావుకి చాలా చిత్రం అనిపించింది. వీడితో పనేంటి, లాయరును తీసుకొద్దాం అనుకున్నాడు. గోవిందరావుకు భయం వేసింది. ఈ రోజు తనని వదుల్తారా? నవ్వుతాడేంటి వీడు - అనుకున్నాడు.

పన్నెండయింది. మళ్లీ ఇంకో రెండు బెదిరిపులూ, వార్నింగులూ భాస్కర్రావు చేత, సూర్యారావుచేత సంతకాలు చేయించుకొని పొమ్మన్నారు. ఈ సారి ఇలా వదలం - నువ్వే చూద్దాగని కదూ - జాగ్రత్త వాళ్ల దగ్గిరపెట్టుకో - ఫో - పోయి భయభక్తులతో మెసులుకో - అన్నారు.

భాస్కర్రావు, గోవిందరావు ఇంటికొచ్చారు. రాజులమ్మ తలకాయ పట్టుకుని కూచుంది. మంగ రాత్రంతా నిద్రపోయినట్టులేదు. కళ్లు చింతనిప్పుల్లా వున్నాయి. మొఖం వాడిపోయి డోక్కుపోయివుంది.

"జులాయిగా తిరిగి, పనీ పాటాలేక, రూపాయి సంపాదన లేక, ఆనాడు అలాగ - ఇప్పుడేదో పనిచేసుకుంటున్నాడు. కాస్త బాగున్నాడనుకుంటే ఇలాగ. అసలెందుకా గొడవలు పనిపాటలు చేసుకుంటూ హాయిగా పెళ్లాం పిల్లల్తో కుదురుగా కాపరం చేసుకోక - ఆ మీటింగు లేటి గొడవలేటి " - అని రాజులమ్మ రాగాలు తీసింది.

మొహం కడుక్కొని స్నానం చేశాడు. భోజనం చేసి పడుకున్నాడు. పోలీసులతో ఈ రకం వ్యవహారం గోవిందరావుకు పూర్తిగా కొత్త. దాంతో బాగా బెదిరాడు. కాని తనకుతనే సమాధానం చెప్పుకున్నాడు. తనను విడిపించడం కోసం భాస్కర్రావు, సూర్యారావు చేసిన ప్రయత్నాలు కాస్త ఊరట కలిగించాయి. రేపు ఏదయినా గొడవవచ్చి, నిజంగా అరెస్టయితే ఆ మాత్రం తనకోసం ఆలోచించే వాళ్లున్నందుకు ఫరవాలేదనిపించింది. పడుకున్నాడనమాటే గాని నిద్ర పట్టలేదు.

బ్లాక్ మార్కెట్ గాళ్లనీ, దొంగసారా అమ్మేవాళ్లనీ, వ్యభిచారగృహాలు నడిపేవాళ్లనీ, దొంగనోట్లు చేసేవాళ్లనీ, విదేశీవస్తువులు స్మగ్లింగ్ చేసేవాళ్లనీ, రాజకీయ గూండాన్నీ, హంతకుల్నీ, రేపిస్టుల్నీ ఇంకా లక్షా తొంభై రకాలుగా ప్రజల్నీ ప్రభుత్వాన్నీ మోసం చేసే, అవినీతి పరుల్ని ఈ పోలీసులేం చెయ్యరు. పైగా వాళ్ల దగ్గిరలంచాలు కతికి వాళ్లకే సలాములు చేస్తారు. లక్షలూ కోట్లూ పన్నులు ఎగగొట్టిన వాళ్లపేర్లు ఆ మధ్యపేపర్లో పడ్డాయి. వాళ్లనేం చేశారు.కనీసం అరెస్టు కూడా చెయ్యలేదు. కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి ఇంట్లో పరుపుల్లో కారుటైర్లలో, బాత్‌రూంలో కోట్లాది బ్లాక్‌మనీ దొరికింది. ఆ వార్త సచిత్రంగా అన్ని పత్రికల్లోనూ పడింది. టీవీల్లో చూపించారు. కాని ఆయన్ని ఏంచెయ్యలేదు.

అవినీతి ప్రశ్నిస్తే తప్పు. లంచగొండి అధికార్లని ఎదిరిస్తే తప్పు. రాజకీయగూండాల్ని ద్రోహుల్నీ పట్టినిలదీస్తే తప్పు. ఈ పోలీసులు పాలకవర్గాలకావలికుక్కలు. గులాములు తొత్తులు. అసలు రాజకీయముఠాలు అధికారం చేజిక్కించుకొని, పదవుల్లో చలామణీ కావడానికి పెట్టుకొన్న రౌడీగ్యాంగ్ పోలీసులు. అందుకే ఏనాడూ పోలీసులు ప్రజలబాగుకోరలేదు. ఎక్కడో ఒకటీ అరా నిజాయితీ పరులున్నా వాళ్లకి డిపార్ట్‌మెంట్‌లో కష్టాలే ఎదురవుతాయి. గోవిందరావుకి తాను చదివిన చెరబండరాజు నవల మాపల్లె, పతంజలినవల కాకీవనం, మోహనరావు నవల కాకీబతుకులు గుర్తొచ్చాయి. పోలీసులు పాలకవర్గాల రక్షకులు తప్ప - ప్రజారక్షకులు కాదన్నది స్పష్టంగా అర్థమైపోయింది. రకరకాల ఆలోచనల్తో నిద్ర పట్టడం లేదు.

నిజానికి గోవిందరావు సంతోషించవలసిందే. ఒంటి మీద ఒక్క దెబ్బ పడలేదు. నోటికొచ్చినట్టూ తిట్టి బాగా బెదిరించారు. ఎన్‌కౌంటరయిపోగలవని కూడా అన్నారుగాని - అంతకు మించి ఏం చెయ్యలేదు. గొప్ప సంగతే. వాళ్లకి గోవిందరావును అరెస్టు చెయ్యడానికి ఏ ఆధారాలూ లేవు అనుమానాలు తప్ప. అందుకే వదిలేశారు. అయితే ఏ ఆధారం లేకుండానే చితక్కొట్టిన సందర్భాలూ, కేవలం అనుమానంతోనే లాక్కుపోయి చంపేసి ఎన్‌కౌంటర్ కథలల్లిన సందర్భాలూ లేకపోలేదు.

సరే తనిప్పుడు ఏం చెయ్యాలి ? వాళ్లు బెదిరించినట్టు పౌరహక్కుల సంఘసభ్యత్వానికి రాజీనామా యివ్వాలా? తన కార్యకలాపాలన్నీ వదులుకోవాలా? అయినా తనిప్పుడు చేస్తున్నది ఏ పాటి గనుక?

పడుకుని గోడల వేపు చుశాడు. ఎదురుగా మార్క్స్ ఏంగిల్స్ లెనిన్ స్టాలిన్ మావో ల ఫోటోలున్నాయి. పోలీసులు లోపలికొచ్చి చూడలేదు. తానింకా శ్రీకాకుళ అమరవీరుల ఫోటోలు కూడా సంపాదించి పెడదాం అనుకుంటున్నాడు. ఐతే ఒకటి - మార్క్స్ - ఏంగిల్స్ - లాంటి ఫోటోలున్నా అంత భయపడనవసరం లేదు. నీకు వాళ్లు తెలుసునా? నువ్వు వాళ్ల వెంట తిరుగుతున్నావా అని నిలదీసే అవకాశం లేదు. వాళ్లు ఇవ్వాళ చరిత్రలో భాగం శ్రీకాకుళం అమరవీరులు కూడా చరిత్రలో భాగమే కాని - వాళ్లు నక్సలైట్లు! కనుక ఆ ఫోటోలు ప్రమాదం నిజానికి పోలీసులు గాని ఇంట్లో దూరి సోదాచేస్తే గట్టి చిక్కే వచ్చిపడివుండును. పాత క్రాంతి పత్రికలూ, విప్లవ పార్టీ కరపత్రాలూ, కోపర్‌డింగ్ కొయ్యూరు హతుల ఫోటోలూ వాల్‌పోస్టర్లూ వున్నాయి. చాలా ప్రమాదం తప్పింది. అవి ఇంట్లో లేకుండా ఇంకెక్కడైనా జాగ్రత్తగా పెడితే అంతసులభంగా దొరకవు. కాని-కాని అవిదగ్గిరుంటేనే తనకు ఎంతో ఉత్సాహం వెయ్యి ఏనుగుల బలం. సరే కాని అంతటి పరిస్థితి వస్తే చూసుకుందాం అని వాట్ని ఒక సంచిలో జాగ్రత్తగా సర్దికాస్త రహస్యంగా అటుకు మీద ఒక మూల అనుమానం రానిచోట దాచాడు.

మంగ అన్నీ కనిపెడుతూనే వుంది. ఎందుకండీ మనకివన్నీ అన్నది. దగ్గిర కూచోబెట్టుకుని అన్ని సంగతులూ వివరంగా చెప్పారు. మంచిదే కాని పోలీసుల్తో గొడవకదా అని భయపడింది.న్యాయం కోసం పోరాటం మంచిదే. కాని ఆ పోరాటంలో మన బ్రతుకు అన్యాయమై పోకూడదు గదా? అని మంగవాదన.

మర్నాడు మామూలుగా పనిలోకి వెళ్లాడు. అంతా చుట్టూ చేరి ఏం జరిగింది. ఏం జరిగిందని

అడిగారు. దాచకుండా అన్నీ చెప్పాడు. సాయింత్రం ఇంటికి వెళ్లాడు. మంగ రాజులమ్మ గుసగుసలాడుతున్నారు. మంగ కూరలు తరగుతున్నది. రాజులమ్మ పండిపోయిన జుట్టు విప్పి చిక్కు తీసుకుంటూ పేలు చంపుతుంది. బుర్ర పిచ్చిపిచ్చిగా దురద దురదగా వుంది.

నువ్వు మీ ఆయనకి చెప్పమంగా - మనకెందుకు పోలీసుల్తో గొడవలు? మన బతుకు మనం బతికితే శాన. దేశం గురించి మనం ఎక్కడ పాటుపడగలం. అన్యాయం ఎక్కడా ఉన్నదే. అంతలక్క పాపం పండిపోయింది. భగవంతుడే పాపాలన్నీ కూడాక ఆళ్లని శిక్షిస్తాడు. మనకేల? రేపు శిరీషకి పెళ్లి చెయ్యాలి. ఇలాంటి గొడవల్లో ఇరక్కుంటే ఆ పిల్లలకి పెళ్లి కావద్దూ? మరొక ఏడాది రెండేళ్లలోపిల్ల ఎలా ఎదిగిపోతాదో చూడు. ఎదిగినపిల్లని ఎన్నాళ్లు ఇంట్లో పెట్టుకుని కూకుంటాం - అని ఏదోదో చెబుతోంది రాజులమ్మ కూతురికి. నిజమే మరి - అనిపించింది మంగక్కూడా

"నువ్వు కదుపు. నాలుగు సంగతులూ చెప్పు. నేను దగ్గిరేవుంటాను. నాకు తోచిన ముక్కలు నేనూ చెబుతాను'' అన్నది పేలను చంపుతూ.

గోవిందరావు అప్పుడే గుమ్మంలో అడుగుపెట్టాడు. అంతా విన్నాడు అర్థమైంది. తను ముందు ఇంట గెలవాలి. విప్లవం ముందు ఇంట్లోనే ప్రారంభించాలి - అనుకున్నాడు. ఏమీ అనలేదు. బట్టలు మార్చుకుని పెరట్లోకి వెళ్లి కాళ్లూ చేతులూ గడుక్కున్నాడు. మంగవచ్చి టీ ఇచ్చింది. ఏం అనలేదు

శిరీష ఈ సంవత్సరం టెన్త్‌క్లాసులో వుంది. హోంవర్కు చేస్తోంది. రేడియోలో వార్తలొస్తున్నాయి. భాస్కర్రావొచ్చాడు. గోవిందరావు భాస్కర్రావుతో కలిసి బయటికి వెళ్లాడు.

తల్లి చెప్పిన మాటలన్నీ మనసులో మెదుల్తున్నాయి మంగకి. పెనిమిటి సంగతి ఏమీ పాలుపోలేదు. ఎటువంటి వాడు ఎలా మారిపోయాడు! దాదాపు అయిదేళ్లక్రితం మనిషి ఎలా వుండేవాడు? ఇప్పుడు ఉద్యమాలూ, పోరాటాలూ, పోలీసులూ ఇలా మారింది జీవిత చక్రం. కాగా గోవిందరావు క్రమంగా తనకొక గమ్యం ఏర్పరచుకున్నాడు, దేశంలో జరుగుతున్న విప్లవోద్యమంలో భాగస్వామి కావడం మమేకమై పాల్గోవడం. ఎప్పటికైనా నూతన ప్రజాస్వామ్యం రావాలి, రాక తప్పదు, ఎన్ని త్యాగాలు, బలిదానాలు చేసి అయినా విప్లవాన్ని విజయవంతం చెయ్యాలి. కుటుంబాలూ, వ్యక్తులూ బాగుపడటం కాదు మొత్తంగా దేశం యావత్తూ విముక్తంకావాలి. సోషలిజం ఏర్పడాలి. ఇప్పుడున్న తప్పుడువిధానాలు, లంచగొండి ప్రభుత్వాల అధికార దాహం, స్వార్ధం, దేశాన్ని విదేశాలకు తాకట్టుపెట్టే దుర్మార్గదుస్తంత్రం నశించాలి. అందుకు తానేం చెయ్యడానికయినా సిద్ధమే. ఏ త్యాగనికయినా సిద్ధమే.

మంగకి కొంచెం కొంచెం సంగతులు అర్థమౌతున్నాయి. నిజమేకాని మరిపోలీసులు, అరెస్టు - ఇవి భయంగా వున్నాయి. తన భర్త ఏం తప్పుచేశాడని పోలీసులు తెల్లవార్లూ స్టేషన్‌లో పెట్టి నాన మాటలూ ఆడి బెదిరించారు? మంగకి అంతా అయోమయంగా వుంది.

భాస్కర్రావు ద్వారా ఒక యుజీకామ్రేడ్‌తో పరిచయమైంది. ఎటు వెళ్తున్నదీ చెప్పకుండా ఒక

నారుమూల సందుల్లోకి గొందుల్లోకి వెళ్లారు. చుట్టూ దీపాల్లేవు చీకటి. ఒక పాతకాలపు పెంకుటిల్లు. పెద్దగా కాంతివంతంకాని సాదా దీపాలు ఆ కామ్రేడ్ చాలా సేపు జరుగుతున్న పోరాటం గురించి, విప్లవోద్యమపు ఎత్తుగడల గురించీ చెప్పారు. 1998 ఆగస్టులో జరిగిన కొప్పర్‌డంగ్ ఎన్‌కౌంటర్‌లో తృటిలో మరణం తప్పించుకుని బయటపడిన వాళ్లలో అతడొకడు. అతని మాటలు వింటుంటే గోవిందరావుకి చాలా ఉద్వేగం కలిగింది. ఇప్పుడే - నిలబడ్డ పాటున - దళంలోకి వస్తానని చెబుదామనుకున్నాడు. కాని - తగిన సమయం వచ్చినపుడు పిలుపు వస్తుంది. సిద్ధంగా వుండమని చెప్పాడా కామ్రేడ్. అర్ధరాత్రప్పుడు ఇంటికొచ్చి, ఏదో ఇంత తిని పడుకున్నాడు గోవిందరావు.

⋆⋆⋆

"పద్మా-"

ఉలిక్కిపడింది మంగ. గోవిందరావు వల్ల మాలిన ప్రేమ పుట్టినపుడు పెళ్లయిన కొత్తలో పద్మా అని ప్రేమగా మృదువుగా చాలా ఆత్మీయంగా పిలిచేవాడు. అప్పటి రోజులు వేరు. సుమారు పదిహేను సంవత్సరాల క్రితం నాటిమాట. తననెవరయినా పద్మా అని పిలిస్తే కొండెక్కినంత సంబరపడిపోతుంది మంగ. చాన్నాళ్ల తరవాత విన్నదా పిలుపు. ఒక్కసారి చెప్పలేని ఆనందంతో నిలువెల్లా పులకించిపోయింది.

అంతలోనే మళ్లీ - "పద్మావతీ!" అని పిలిచాడు. ఒక్క అంగలో గోవిందరావు దగ్గిరకొచ్చింది.

"ఏం ఎందుకలా పిలిచారూ?" అన్నది మొహంనిండా వెలుతురుతో

"పిలవకూడదా?"

"కాదులే-"

బుజం మీద చనువుగా చేతులు వేసి సరదాగా ఏవేవో మాట్లాడాడు, ఎప్పుడూ తమ దాంపత్యం ఇలా పూలనావలో ప్రయాణంలా హాయిహాయిగా సాగిపోకూడదా అనిపించింది. అతను చెప్పే ప్రతిమాట మధురాతి మధురంగా వినిపిస్తోంది- మంగకి.

నెల్లిమర్లలో జూట్‌మిల్లు మళ్లీ నడుస్తోంది. కానీ అక్కడికిక వెళ్లడు. దినదినగండంగా నూరేళ్ల ఆయుష్షుగా నడిచే ఆ ఉద్యోగం ఇక చెయ్యడు. అవును మంచిదే ఇక్కడ బాగానే వెళ్తుంది గదా మళ్లీ అక్కడికి దేనికి లే అన్నది.

తరవాత ఒక్కొక్కటీ చెప్పుకొచ్చాడు. దేశంలో అన్ని ప్రాంతాల్లో ప్రజా ఉద్యమాలు జరుగుతున్నాయి. ఎందరెందరో యువకులు నిస్వార్థంగా పనిచేస్తున్నారు. ప్రాణాలు బలియిస్తున్నారు. ఒక అచంచల విశ్వాసంతో దేశంలో ఎప్పటికైనా తప్పక విప్లవం విజయవంతమై తీరుతుందన్న ఆశాభావంతో పనిచేస్తున్నారు. రేపు నేనూ ఉద్యమంలో దూకితే నువ్వు అందుకు సంసిద్ధంగా వుండాలి - అన్నాడు.

నిజమే, అన్యాయాన్నీ అక్రమాన్నీ ఎదిరించవలసిందే కాని - సంసారం పిల్లలు వాళ్ల భవిష్యత్తు? ఎవరు చూస్తారు? దేశం కోసం త్యాగం చెయ్యాలనుకుంటే - ఆ నిర్ణయం ఏదో ముందే తీసుకుని

ఉండవలసింది. పెళ్లి చేసుకోకుండా ఉండవలసింది. ఒక వేళ చేసుకున్నా అటువంటి అమ్మాయినే, అన్నిటికీ సిద్ధపడే అమ్మాయినే చేసుకుని ఉండవలసింది. బిడ్డల్ని కనకుండా జాగ్రత్తపడి మొదట్నించీ ఆ రకంగానే జీవితాన్ని మలుచుకుని ఉండవలసింది. కాని ఇప్పుడెలా? ఈ సంవత్సరం శిరీష టెన్త్‌క్లాసు పరీక్షలు రాస్తుంది. తప్పక పేసవుతుంది. తరవాత చదివించాలా? ఇంట్లో కూచొబెట్టి పెళ్లి సంబంధాలు చూడాలా? నవీన్ అయిదు పూర్తి చేస్తాడు. శ్రీలక్ష్మి కూడా బడికి బయల్దేరుతున్నది. తాము ప్రస్తుతం ఉండటానికి లోటు లేదు. రేపు? రేపు రాజులమ్మ మరింత మూలనపడిచ్చు లేదా ఏక్షణాన్నయినా మరణించొచ్చు. ఈ యిల్లు, ఈ బాధ్యతలు ఎవరుచూస్తారు? ఆ మాటే చెప్పింది.

గోవిందరావు అన్నీ జాగ్రత్తగా విన్నాడు. నిజమే ఏ ఇల్లాలయినా అలాగే మాట్లాడుతుంది. ఎవ్వరూ ముందుగానే నిర్ణయించుకున్న విధంగా ఉద్యమాల్లోకి వెళ్లలేరు కదా, పరిస్థితులే వారినాపనికి పురికొల్పుతాయి. తాత్కాలికంగా ఆ సంభాషణ ఆగింది. దగ్గిరికి తీసుకుని ముద్దుపెట్టుకున్నాడు.

గోవిందరావు పనిలోకి వెళ్లాక మంగ ఈ సంగతులు క్లుప్తంగా తల్లితో చెప్పింది. వింటూ రాజులమ్మ అలా వుండిపోయింది. ఆ మాటలన్నీ ఆలకించి కాస్సేపటికి తేరుకుని-

"నిజమేననుకో మనం ఎక్కడ సాగ్గలం చెప్పు ? ఏటంటాడు. పెళ్లాం పిల్లల్ని వదిలీసి దేశసేవచేస్తాడా? లేనిపోని గొడవలన్నీ నెత్తికెత్తుకుని మనం నెగ్గగలమా - చాలగలమా?" అన్నది రాజులమ్మ.

ఆ మాటలు వింటుంటే మనసులో పిరికితనం తోచింది మంగకి.

పగలంతా షెడ్డులో పనిచేస్తున్నా గోవిందరావులో రకరకాల ఆలోచనలు చెలరేగుతున్నాయి. జీవితం ఎక్కువ భాగం వ్యర్థమయింది. జులాయిగా తిరిగాడు. తప్పుడు అవగాహనతో, తప్పుడు విలువల్తో కాలం విలువ తెలియకుండా ఎలాగో బ్రతికేశాడు. భాస్కర్రావు వంటి స్నేహితులు కలవడం వల్ల - క్రమంగా మార్పొచ్చింది. పరిస్థితులు కూడా అందుకు తగ్గట్టు ఏర్పడ్డాయి. తనిప్పుడు కొత్త మనిషయ్యాడు. తన ఆలోచనా విధానంలోనే సమూలమైన మార్పొచ్చింది. ఇక ఇప్పుడు మరొక రకంలా వుండలేడు. పనిచెయ్యకుండా మానలేడు.

కుటుంబ వ్యవస్థ చాలా బలమైనది. దాన్ని ఛేదించుకుని బయటికి రావడం ఎంతటి వాళ్లకీ కష్టమే. అందుకే ఇంట గెలిచి రెచ్చగెలవమన్న సామెతపుట్టింది. ఇల్లు ఒక దాటలేని కోట తప్పించుకోలేని ఊబి. నిజంగా సంసారం అంటే సాగరమే. తరించటం అంటూ వుండదు. బంధాలూ అనుబంధాలూ రుణాలూ మమకారాలూ బలంగా పట్టుకుని మనిషిని ఎటూ బెసకనివ్వవు. లాభం లేదు. సంసారాన్ని ఏం చేస్తాడు. తనకి బాధ్యతలున్నాయి. శిరీషకు పెళ్లిచెయ్యాలి. భార్యపిల్లల్ని పోషించాలి. ఆఖరి పిల్ల శ్రీలక్ష్మికి కూడా పెళ్లి చేసేసరికి తనకి యాభయ్యేళ్లు దాటిపోవచ్చు. లొంగి పోతాడు. ఓపికవుండదు. ఈ పనులన్నీ చేస్తూ తను ఇంకా ఉద్యమాల్లో ఏం పాల్గొంటాడు? ముందు ఈ సంసారసాగరాన్ని దాటాలి. అజ్ఞాతంలోకి వెళ్లి ఆయుధం పట్టాలి. పోరాడాలి. దళాల్లో కలిసి ప్రజా సంక్షేమం కోసం పనిచెయ్యాలి. విప్లవం విజయవంతం చేసే క్రమంలో తన జీవితాన్ని అంకితం చెయ్యాలి.

సాయుధ పోరాటం సాగుతుంటుంది ఒకపక్క. మరొక పక్క దానికి సమాంతరంగా భావజాల పోరాటం, సాంస్కృతిక పోరాటం సాగాలి. కులం, మతం ఈ సంకుచిత పరిధులన్నింటినీ ఛేదించాలి. కుటుంబాలు మారాలి. ప్రజల్ని ముందుకు నడిపించాలి. ప్రజల్ని ప్రజాయుద్ధంలో పాల్గొనేందుకు సమాయత్తం చేయ్యాలి. సమగ్రవిప్లవంలో ప్రజల్ని భాగస్వాముల్ని చెయ్యాలి. ఈ మార్గానికి, ఈ గమ్యానికి, ఈ తుది లక్ష్యానికి దగ్గిర దారులూ అడ్డదారులూ వుండవు.

గోవిందరావు తలలో ఆలోచనలు ముసురుకుంటున్నాయి.

ఆ సాయంత్రం శ్రీకాకుళం జిల్లా నుంచి కరపత్రాలొచ్చాయి. కులనిర్మూలనా పోరాట సమితిలో పనిచేస్తున్న ఒక టీచర్ని పోలీసు అరెస్టు చేసి విపరీతంగా కొట్టారు. ఎముకలు విరిగాయట. పౌరహక్కుల సంఘంలో పనిచేస్తున్న పున్నయ్యని, విప్లవ రచయితల సంఘంలో పనిచేస్తున్న మోహనరావుని గత నెలరోజులుగా అక్రమనిర్బంధంలో వుంచారు. వాళ్లని కోర్టుకు హాజరుపరచలేదు. పార్టీ రహస్యాలు చెప్పమని హింసిస్తున్నారు. చెప్పకపోతే ఎన్‌కౌంటర్‌యిపోతారు. జాగ్రత్త - అని బెదిరిస్తున్నారు. ఈ అన్ని విషయాల మీద పౌరహక్కుల సంఘం ఒక కరపత్రం వేసింది. ఉద్యానం పొయ్యిమీద పెనంలావుంది.

శ్రీకాకుళం జిల్లా పౌరహక్కుల సంఘం వేసిన కరపత్రం చదివి వేడెక్కిపోయాడు. లాభం లేదు. సాయుధ పోరాటం చెయ్యవలసిందే. పాలకవర్గ దమనకాండ రానురాను మితిమీరి పోతున్నది. తాను ఇక దళాల్లోకి వెళ్తాడు. ఆయుధం పడతాడు. పార్టీ రహస్యపత్రిక కాంతి కూడా అక్షరం విడిచిపెట్టకుండా చదివాడు. విప్లవం సరళ రేఖకాదు. ఎన్నెన్నో వంకర్లు తిరుగుతుంది. ఉద్యమ అవసరాలరీత్యా ఎత్తుగడలరీత్యా ఆ మలుపులు తప్పవు. ఆ అన్ని మలుపుల్నీ సక్రమంగా అర్ధం చేసుకోవాలి. ఆలోచనలతో మనసు వేడెక్కిపోయింది. చాలాసేపు నిద్రపట్టలేదు.

ఉదయం ఆలస్యంగా లేచాడు.రాత్రి చినుకులు పడినట్టున్నాయి. పెరడంతా తడితడిగా వుంది. కిటికీ లోంచి రోడ్డు మీదికి చూశాడు. గతుకుల్లో నీరు నిలిచింది.

పెరట్లో బీరపాదుకు గొంగళిపురుగు పట్టింది. రాను రాను ఎక్కువయ్యాయి. రాజులమ్మ బీరపాదు కొట్టేసి ఆ తుక్కు మంట బెట్టేసింది. పచ్చిరొడ్డ, ఆ మధ్యలో ఉన్న గొంగళి పురుగులు చిటపటలాడుతూ కాల్తున్నాయి. గొంగళి పురుగులు మంటల్లో కాలడం వేడుకగా చూస్తున్నారు పిల్లలు దూరదూరంగా పాకుతున్న పురుగుల్ని పుల్లముక్కతో మంటల్లోకి తోస్తున్నాడు నవీన్. ఒక దుర్వాసన వ్యాపించింది. గోవిందరావు డ్యూటీకీ బయల్దేరాడు. పొగ, చూశాడు. ఏదో అర్ధమయినట్టయింది. సర్పయాగం అంటే ఇదే. దుష్టశిక్షణ. ఇది తప్పదు. దుష్టశిక్షణ అమలు జరగనిదే శిష్టరక్షణ జరగదు. చీడపురుగులు చావాలి. పురుగున్న నాశనం చెయ్యకపోతే పచ్చని పంట నాశనమౌతుంది.

ఆ సాయంత్రం ఇద్దరు కొత్త మిత్రులు పరిచయమయ్యారు. ఒకతను మన్మధరావు - లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్నాడు. మరొకతను రామారావు పోస్టల్ డిపార్ట్‌మెంట్ కొత్త అగ్రహారంలో

సబ్‌పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్నాడు. వాళ్లిద్దరికీ వామపక్ష భావజాలంపట్ల ఆసక్తి వుంది. ఇప్పటికే అరుణతార, స్వేచ్ఛ మొదలైన పత్రికలు చందాకట్టి తెప్పించుకుని రెగ్యులర్‌గా చదువుతున్నారు. ఇటీవల టౌన్‌లో జరిగిన, సమావేశాలన్నింటికీ హాజరయ్యారు. ఇప్పుడు పౌరహక్కుల సంఘంలో సభ్యత్వం తీసుకున్నారు.

దామోదరావు వచ్చాడు. అతను ఉత్తరాంధ్రలోని మూడుజిల్లాల్లో విప్లవ పార్టీకి అనుబంధంగా వున్నకా విరసం, పౌరహక్కుల సంఘం, డెమోక్రాటిక్ టీచర్స్ ఫెడరేషన్, కులనిర్మూలనా పోరాట సమితి మొదలైన సంస్థల కృషిని సమన్వయపరుస్తాడు. ఆ సంస్థ బాధ్యులందర్నీ కలిసి ఎప్పటికప్పుడు పరిస్థితుల్ని చర్చిస్తుంటాడు. దాదాపు బాల్యంలోనే ఉద్యమంలోకి వచ్చాడు. వాళ్ల మామగారు పెద్దలాయరు. 1970 ప్రాంతాల్లో శ్రీకాకుళం నక్సలైట్లు కేసులు వాదించాడు. ఆయనకిప్పుడు సుమారు ఎనభై ఏళ్లుంటాయి. విశాఖపట్నంలోనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. దామోదరావు వయసు ముప్ఫయి అయిదు, ముప్ఫయిఆరు ఉండొచ్చు. విశ్రాంతి లేకుండా పనిచేస్తాడు. యూనివర్శిటిలో చదువుకునే రోజుల్లో రెబెల్‌స్టార్ దామోదరరావు అన్న ముద్ర పడింది. విద్యార్థినాయకుడిగా రెండేళ్లు యూనివర్శిటీలో గట్టిగా పనిచేశాడు. లెక్చరర్లకీ, ప్రొఫెసర్లకీ సైతం అతనంటే పక్కాబెదురే.

అప్పన్నదొర పుస్తకాల షాపులో పది పదిహేను మంది రాకా చేరారు. వివిధ ప్రజాసంఘాల బాధ్యులు వచ్చారు. దామోదరరావు అందరితోనూ మాట్లాడడు. పరిస్థితుల్ని పని తీరునూ పరీక్షించుకున్నారు. పొరపాట్లు, బద్ధకం వదిలి ఆత్మపరిశీలన చేసుకున్నారు. మరింత అంకిత భావంతో ఉద్యమంలో పనిచెయ్యవలసిన అవసరం గురించె చెప్పాడు. ఉదయం చీకట్నే వెళ్లిపోయాడు.

నవంబర్ 23 గురువారం భక్తజనం సాయిబాబా జన్మదినవేడుకల్లో మునిగిఉన్నారు. పెద్ద ఎత్తున భజనలు జరుగుతున్నాయి. సుంకరి వీధిలో సత్యసాయిమందిరం దగ్గిర పేదలకు అన్నదానం చేశారు. ఎక్కడలేని ముష్టివాళ్లూ, కుష్టురోగులూ తండోపతండాలుగా వచ్చారు. గుడ్డివాళ్లు కుంటివాళ్లు పండుముసలివాళ్లు చిన్న పిల్లలు రోడ్డు మీద మురికి కాలవలపక్కన కూచుని విస్తరాకుల్లో పెట్టియిచ్చిన అన్నం ఆవురావురుమని తింటున్నారు. గోవిందరావుకు ఆదృశ్యం చూసి గుండె తరుక్కుపోయింది.

సాయింత్రం అయిదు గంటలవుతుంది. భాస్కర్రావు పిడుగులాంటి వార్తపట్టుకొచ్చాడు. ఉదయం 11 1/2 - 12 గం॥ ప్రాంతంలో హైదరాబాద్ పౌరహక్కుల సంఘం నాయకుడు పురుషోత్తంగార్ని మాజీ నక్సలైట్లు కిరాయి గుండాలు కలిసి కత్తులతో నరికి చంపేశారట. మధురానగర్‌లో తనయింటినుంచి కొద్ది దూరంలో వున్న షాపుకు వెళ్లి సబ్బులు కొని తిరిగిసవస్తుండగా - సర్రున టాటాసుమో బండివచ్చింది. నలుగురు దిగారు. ఇద్దరు చుట్టూ చూస్తున్నారు. మరో యిద్దరు పురుషోత్తం వెంటనడిచారు. పురుషోత్తం అనిపిలిచాడొకడు. ఆయన వెనక్కితిరిగాడు. అంతే ఇద్దరూ మీదపడి కత్తులతో మెడకోసేశారు. అడ్డం పెట్టబోయిన చేతివేళ్లు తెగిపోయాయి. అక్కడికక్కడే నేలమీద పడిపోయాడు. రక్తపుమడుగు మెడ దాదాపు తెగిపోయింది. అంతా పదినిముషాలలోపునే ముగిసింది. విప్లవవ్యతిరేక నినాదాలిస్తూ ఖబడ్దార్ ఎవరికైనా సరే పురుషోత్తం గతేపడుతుంది. అని హెచ్చరికలు చేసుకుంటూ - మళ్లీ బండెక్కి

వెళిపోయారు. ఎవరో గబగబా యింటికి పరుగెత్తి భార్యకు కబురు చెప్పారు. ఆమె గోడుగోడున విలపిస్తూ పరుగెత్తు కొచ్చింది. అంతలోనే పోలీసు కమిషనర్ కుక్కలతో సహా హాజరయ్యాడు. గబగబ శవాన్ని ఆస్పత్రికి తరలించడం ప్రారంభించారు. నిముషాలమీద అంబులెన్స్ వచ్చింది. నేను ఆయన భార్యను ? ఎందుకు ఆయన్ని ఆస్పత్రికి తీసుకెళ్తారు? నా యిష్టం కాదని ఆయన్ని ముట్టుకోవద్దు అని అరుస్తున్నా వినిపించుకోలేదు.

భాస్కర్రావు టీవీలో చెప్పిన ఈ వార్తల్ని - గోవిందరావుకు చెప్పాడు.

గోవిందరావుకు తననే ఎవరో చంపేసినట్టు అనిపించింది. మనసంతా చెప్పరానంత తీవ్రంగా ఆక్రోశించింది. సుమారు నెలక్రితం ప్రకాశం పార్కులో జరిగిన సభలో ఆయన ప్రసంగించాడు. ఎంత సౌమ్యుడు! పురుషోత్తం గార్ని చంపడం ఏమిటి? పైగా పట్టపగలు జనం అంతా చూస్తుండగా! ఇంతకంటె ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు వార్త యింకోటి ఉంటుందా?

ఇద్దరూ నడుచుకుంటు మాట్లాడుకుంటూ గోవిందరావు యింటికి వెళ్లారు. గుమ్మంలోనే మంగ ఎదురొచ్చింది. పౌరహక్కుల నాయకుల్ని చంపేశారట - అని తాను మధ్యాహ్నం టీవిలో చూసిన వార్త చెప్పింది. ఇద్దరికీ టీ యిచ్చింది. అన్యమనస్కంగానే టీ తాగారు. కాస్సేపట్లో వార్తలొచ్చాయి. అంతా వివరంగా చూశారు. గోవిందరావుకు పిచ్చి ఆవేశం వచ్చింది. లాభం లేదు ఇక లాభం లేదు - ఎంత మాత్రం ఆలస్యం చెయ్యకూడదు. విప్లవ పార్టీలో కలిసిపోవాలి. దళాల్లో కలవాలి. కబుర్లు చెబితే లాభం లేదు. ఆయుధం పట్టాలి తప్పదు- అనిపించింది.

చాలాసేపు ఇద్దరూ మాట్లాడుకున్నారు. డిసెంబర్ 10, 11 తేదీల్లో అనంతపురంలో పౌరహక్కుల మహాసభలు జరగవలసివుంది. హత్యకు కొద్ది సేపటికి ముందే - శ్రీకాకుళంలో విప్లవరచయితల సంఘం సభ్యుడు మోహనరావు అక్రమ అరెస్టును ఖండిస్తూ పత్రికలకు ప్రకటన విడుదల చేశాడుట!

1997లోనే మహబూబ్‌నగర్‌లో - ఒకసారి హత్యాప్రయత్నం జరిగింది. ఇటీవల నాలుగు నెలల క్రితం - ఉద్యమ అవసరాల రీత్యా - హైకోర్టులో కేసులున్న కారణంచేత మకాం హైదరాబాద్‌కు మార్చాడు. ఆయన భార్య మహిళాసంఘాల్లో చురుగ్గా పనిచేస్తున్నది. కూతురుకి ఎనిమిదేళ్లుంటాయి. పేరు స్వేచ్ఛ! పౌరహక్కుల సంఘపత్రిక పేరుకూడా స్వేచ్ఛే! ఆయన కూతురుకు చాలా చిన్నప్పటి నుంచీ, తను పనిచేస్తున్న ఉద్యమం గురించి వివరంగా బోధపరుస్తూ వచ్చాడట. గోపీ రాజన్న, రామనాథం, జాపాలక్ష్మారెడ్డి, నర్రా ప్రభాకరరెడ్డిలను - గూండాలు ఎలా చంపేశారో - అసలు ఆ గూండాలు ఎవరో కూడా వివరించాడు. కొన్ని సందర్భాల్లో మఫ్టీ పోలీసులు - కొన్ని సందర్భాలో కిరాయి గూండాలు- రేపు ఇలా నన్నెవరన్నా హత్య చేసినా నువ్వు ఏడవకూడదు - భయం, నిరాశ పడకూడదు - పెరిగి పెద్దయి నువ్వూ అమ్మా ఉద్యమం కోసం పనిచెయ్యాలి - అని వొళ్లో కూచోబెట్టుకుని చెప్పేవాడట.

సరిగ్గా అన్నం తినలేదు. తినబుద్ధికాలేదు. రాత్రి చాలాసేపు ఇద్దరూ ఎన్నెన్నో సంగతులు

మాట్లాడుకుంటూ కూచున్నారు. పదకొండయింది - అని ఒకసారి మధ్యలో టైం చెప్పింది మంగ. భాస్కర్రావు ఎప్పుడు వెళ్లాడో తెలియదు.

వారం పదిరోజులు గడిచాయి. రకరకాల ఆలోచనలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గోవిందరావును - మహబుబ్‌నగర్ జిల్లాలో పురుషోత్తం స్వగ్రామం వరకూ చాలా పెద్దఎత్తున అంతిమయాత్ర జరిగింది. వేలాది మంది అభిమానులు పాల్గొన అంతిమయాత్రలో తండ్రి శవం పక్కనే నిలబడింది స్వేచ్ఛ చిన్న చిన్న పిడికిళ్లు బిగించి నినాదాలిచ్చింది.

పౌరహక్కుల నేతనే హత్య చేస్తారా?

ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం పోలీసు రాజ్యం పోలీసురాజ్యం

దిక్కు మొక్కులేని జనం - ఒక్కొక్కరు అగ్నికణం

ఎన్ కౌంటర్లన్నీ పోలీసు హత్యలే.

పోలీసులూ, ప్రభుత్వమూ నానారకాల నాటకాలూ ఆడుతున్నారు. ఒక ప్రకటనకీ మరొక ప్రకటనకీ పొంతన వుండటం లేదు. నయీముద్దీన్ - నాలుగురోజుల తరవాత - హత్య చేసిన ఆయుధాల్తో సహా దొరికి పోయేడట. కోర్టులో హాజరు పర్చారు. మఫ్టీపోలీసులు హంతకులకు దండలు వేశారు. ఛీఛీ ఇంత మరీ బరితెగించడమా? ఇంత నిస్సిగ్గుగా పోలీసులు ప్రవర్తించడమా అని సామాన్యజనం సైతం ఛీ కొట్టారు. ఎవడీ పురుషోత్తం - అన్నాడట ముఖ్యమంత్రి. వివిధ ప్రజా సంఘాలవారు. వారు ముక్తకంఠంతో ఈ చర్యను ఖండించారు. నయీముద్దీన్ మాజీనక్సలైటు ఈ సారి పోలీసులు కూత ఆట ఆడారు. మాజీ నక్సలైట్ల చేత హత్యలు చేయిస్తున్నారట! ఒక విప్లవ రచయితని చంపుతామని ఫోన్ కాల్స్ వస్తున్నాయిట! ఆయన కోరుకుంటే గన్‌మెన్ ఇస్తామని డి.ఐ.జి. ప్రకటించారు. ఆయన తిరస్కరించాడు. ఈ మొత్తం సంగతులన్నీ దాదాపు అన్ని పత్రికల్లో వచ్చాయి.

వాల్‌పోస్టర్లూ కరపత్రాలూ వచ్చాయి. పురుషోత్తం హత్యను ఖండిస్తూ బహిరంగ సభ పెట్టాలని - పౌరహక్కుల సంఘం మిత్రపక్షాలూ నిర్ణయించాయి. పురుషోత్తం ఫోటోవున్న వాల్‌పోస్టర్లు - భాస్కర్రావు, గోవిందరావు కలిసి ఊరంతా అంటించడానికి బయల్దేరారు.

టైమెంతయిందో తెలియదు. తలుపు చప్పుడయితే వెళ్లి తలుపుతీసింది. నడిరాత్రి దాటి వుంటుంది. గోవిందరావు వచ్చాడు. కాళ్లూ, చేతులూ కడుక్కుని బట్టలు మార్చుకుని వచ్చి పిల్లలందర్నీ ఒకసారి చూశాడు. ఇంత మజ్జిగిస్తే తాగాడు. మంగకి మనసంతా ఎలాగోవుంది. ఏమిటీ మనిషి!

గోవిందరావు లైటు తీసేసి మంచం మీద వాలాడు. ఆశ్చర్యపోయింది. తమకంతో కమ్ముకున్నాడు. ఎన్నాళ్లయిందో ఇంత నరాలు తెగిపోయే కోర్కెతో కలవడం, ఆ ప్రేమ, ఆ ఆత్మీయత - ఏమయిపోయాయి. కరిగిపోయింది. మంగ... కాని నిజమేనా? కలా? నిజమేనా?

★★★

డిసెంబరు 6, బుధవారం మరి కొద్ది రోజుల్లో శతాబ్దం ముగుస్తుంది. 1 జనవరి 2001 రాబోతుంది. కాలచక్రం అనంతంగా తిరుగుతోంది, ఎవరికోసం ఆగదు కాలం.

చలిఎక్కువగా వుంది. కళ్లు తెరిచేసరికి - తల్లి పనులు చేస్తూ కనిపించింది. నవీన్, శ్రీలక్ష్మి పడుకున్నారు. శిరీష లేచింది. చలికి కప్పుకున్న దుప్పటి తీసి లేచి కూచుంది. ఇంకా ఒక పక్క చీకటి గానే వుంది. ఇంకా సూర్యోదయం పూర్తిగా అయినట్టులేదు.

పెనిమిటి కోసం చూసింది. బాత్‌రూంకు వెళ్లి వుంటాడు. లేచి బాత్‌రూంకు వెళ్లొచ్చింది. అమ్మా మీ అల్లుడేరీ అన్నది ఆందోళనగా.

"రాత్రి వచ్చాడా యింటికి" అనడిగింది రాజులమ్మ

బాగానే వుంది. ఒక్కసారి గుండె బరువుగా కొట్టుకుంది. భయంతో వళ్లంతా వణికింది. వెన్నులోంచి చలి తలలోకి ఎక్కింది. అందుకేనా రాత్రి అలా ప్రవర్తించాడు! మంచినీళ్ల గ్లాసు కింద కాయితం. భయం భయం. అమ్మా అమ్మా అని అరిచింది. శిరీష వచ్చింది, నోట్లో బ్రష్షుతో, చేతిలో చీపురుపడేసి రాజులమ్మ వచ్చింది. వణుకుతూనే, కీడుశంకిస్తూనే కాయితం తీసి మడతవిప్పింది.

"పద్మావతీ - ఏం భయంపడకు, నేను విప్లవోద్యమంలోని వెళ్తున్నాను. పిల్లలకి జాగ్రత్తగా అన్ని సంగతులూ బోధపర్చు అప్పుడప్పుడు ఉత్తరాలు రాస్తుంటాను. ధైర్యంగా వుండు.

ఒక మహత్తర లక్ష్యంతో ఒక గమ్యం కోసం వెళ్తున్నాను. అర్థం చేసుకో" -

మొదలు నరికిన చెట్టులా అలా కుప్పకూలిపోయింది.

ఆలస్యంగా సూర్యుడు గుమ్మంలోకిచ్చాడు. మంచుతెరలు కొంచెం విడుతున్నాయి. రాజులమ్మకి గుండె జారిపోయింది. ఈ సంసారం ఎలా ఈడవడం. పిల్లలు నాన్నేరమ్మా అని అడిగారు. శిరీషకు విషయం అర్థమైంది గాని స్పష్టంగా తెలియలేదు. ఎండెక్కేసరికి మన్మధరావు, రామారావు చెరోస్కూటరు మీదా వచ్చారు. ఇంతలో భాస్కర్రావు కూడా వచ్చాడు అంత పలకరించారు. తన పెనిమిటి తనతో ఒక్కమాట చెప్పేడు కాదు. అదే బాధ.

గోవిందరావు విప్లవపార్టీలో చేరడానికి వెళ్లాడని చెప్పారు. తాము నెలనెలావచ్చి తోచిన ఆర్థిక సహాయం చేస్తుంటారట భయపడద్దట! ధైర్యంగా వుండాలట. మీకొచ్చిన భయం లేదట, మేం ఉన్నామట!

ఒక్క క్షణం కళ్లముందు అంతా తెల్లగా అదో క వెలుతురులా కనిపించింది. కన్నీళ్లు తుడుచుకుని లేచి నిలబడింది - ధైర్యంగా ధైర్యంకాక !

రచనకాలం: సెప్టెంబరు 2000